'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 25 | బుధవారం | 9.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 25 | Wednesday | 9.9.2026 | Pages: 8 | Rate: 2

# మోదీ పర్యటనలో తుపాకీ కలకలం

## పీఎంవో అధికారినంటూ నకిలీ ఎంట్రీ

ప్రధాని నరేంద్ర మోదీ ముంబై పర్యటనకు ముందు బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో భద్రతా కలకలం చోటుచేసుకుంది. ప్రధాని పాల్గొననున్న కార్యక్రమ ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు తాను ప్రధాని కార్యాలయం (పీఎంవో) అధికారినంటూ చెప్పుకున్నట్లు సమాచారం. అతని వద్ద నకిలీ గుర్తింపు కార్డును పోలీసులు గుర్తించారు. ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ ప్రాంగణంలో వీరిని గుర్తించినట్లు అధికారిక వివరాలు వెల్లడించాయి. నకిలీ ఐడీ కార్డుతో పట్టుబడిన వ్యక్తిని 24 ఏళ్ల రోహన్ పరేఖ్‌గా గుర్తించారు. అతనితో ఉన్న అంగరక్షకుడి వద్ద తుపాకీ ఉన్నట్లు భద్రతా సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల సమయంలో ఐడీ కార్డు అనుమానాస్పదంగా కనిపించడంతో మరింత లోతుగా పరిశీలించగా అది నకిలీదని తేలింది. పీఎంవో అధికారినంటూ చెప్పుకోవడం వెనుక కారణమేంటి? తుపాకీతో ఉన్న బాడీగార్డుతో కలిసి ప్రధాని కార్యక్రమ ప్రాంగణంలోకి ఎందుకు రావాలనుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాల కోసం ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేస్తోంది.

3లో..





# నిష్పాక్షికతే నమ్మకానికి బలం

**'రాజ్యసంస్కరణ' మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి: వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి**

వరంగల్: ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర అత్యంత కీలకమని, ప్రజలకు వాస్తవాలను నిష్పాక్షికంగా అందించే వార్తలకే విశ్వసనీయత లభిస్తుందని వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి అన్నారు. వార్తల ప్రచురణలో వాస్తవ నిర్ధారణ, నిష్పాక్షికత, ప్రజా ప్రయోజనం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 'రాజ్యసంస్కరణ' దినపత్రిక చీఫ్ ఎడిటర్ గుండెబోయిన వెంకన్న, చీఫ్ రిపోర్టర్ గుండెబోయిన వెంకటేశ్వర్లు (చిన్నా) ఆయనను కలిసిన సందర్భంగా.. పత్రిక ప్రచురణ, సర్క్యులేషన్ తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సమాజంలోని వివిధ వర్గాల గొంతుకగా నిలవాలని ఆకాంక్షించారు. పత్రికా రంగంలో పోటీ పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విశ్వసనీయతను కాపాడుకోవడం ద్వారా పాఠకుల ఆదరణను మరింతగా పొందవచ్చన్నారు. ఒక వార్తను ప్రచురించే ముందు వాస్తవాలను పరిశీలించడం, సంబంధిత వర్గాల అభిప్రాయాలను తెలుసుకోవడం వంటి అంశాలు పత్రిక విశ్వసనీయతను పెంచుతాయని తెలిపారు. 'రాజ్యసంస్కరణ' దినపత్రిక భవిష్యత్తులో గొప్పగా ఎదిగి, పాఠకుల నమ్మకాన్ని చూరగొనాలని ఆకాంక్షించారు.



# ఎర్రవల్లి కేసీఆర్ ఇళ్లు ముట్టడి

## కాంగ్రెస్ పిలుపుతో ఉద్రిక్తత

కేసీఆర్ ఎర్రవల్లి నివాసం ముట్టడికి కాంగ్రెస్ నేతలు ఇచ్చిన పిలుపు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కేసీఆర్ ఇంటి వైపు వెళ్తున్న కాంగ్రెస్ నేతలను బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట, రాళ్లదాడి జరిగింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎర్రవల్లికి వస్తున్నారన్న సమాచారంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అప్రమత్తమై అసెంబ్లీ నుంచి అక్కడికి బయల్దేరారు. అయితే బొల్లారం వద్ద భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లి వైపు నడుచుకుంటూ వెళ్లారు. హకీంపేట్ దాటిన తర్వాత పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కేటీఆర్‌ను బోయిన్‌పల్లి పీఎస్‌కు, హరీశ్‌రావును జవహర్‌నగర్ పీఎస్‌కు తరలించారు. ఇద్దరినీ విడుదల చేసిన తర్వాత వారు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

(వివరాలు 2లో..)

# కేసీఆర్ హత్యకు కుట్ర

## కేటీఆర్ సంచలన ఆరోపణలు

### రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే



బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. కాంగ్రెస్ నేతలు డప్పులతో ఫామ్‌హౌస్ ముట్టడికి ప్రయత్నించారని బీఆర్ఎస్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో కేసీఆర్‌ను పరామర్శించేందుకు, ఆయనకు రక్షణగా బయలుదేరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. కేసీఆర్ హత్యకు కుట్ర జరుగుతోందని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కేసీఆర్‌కు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలను ఫామ్‌హౌస్ వరకు ఎలా అనుమతించారని ప్రశ్నించిన కేటీఆర్.. తమ నాయకుడి ఇంటికి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. కేసీఆర్ భద్రత విషయంలో పోలీసులపై నమ్మకం లేదని, "మన నాయకుడు కేసీఆర్‌ను మనమే కాపాడుకోవాలి" అంటూ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

(వివరాలు 2లో..)

# హిందూ గ్రూప్ ఈఫిల్ టవర్ రగడ

- మహిళలను పక్కకు తప్పించడంపై రచ్చ
- బీఏపీఎస్ వివాదంపై కేంద్రం రియాక్షన్



పారిస్‌లోని ప్రపంచ ప్రఖ్యాత ఈఫిల్ టవర్ వద్ద బీఏపీఎస్ హిందూ మత సంస్థ ప్రతినిధుల పర్యటన వివాదంగా మారింది. సుమారు 100 మంది సభ్యులతో కూడిన బీఏపీఎస్ బృందం ప్రైవేట్ పర్యటనకు వెళ్లిన సమయంలో మహిళా ఉద్యోగులను పక్కకు తప్పించారన్న ఆరోపణలు వచ్చాయి. కొందరిని విధుల నుంచి ఇతర ప్రాంతాలకు పంపించారని, మరికొందరి స్థానాల్లో పురుష ఉద్యోగులను నియమించారని ఈఫిల్ టవర్ సిబ్బంది ఆరోపించారు. బృందం అక్కడ ఉన్నంతసేపు మహిళా ఉద్యోగులు కొన్ని ప్రాంతాల్లోకి వెళ్లకూడదని ఆదేశాలు ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ పరిణామంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సిబ్బంది సమ్మెకు దిగారు. దీంతో ఈఫిల్ టవర్ సోమవారం పూర్తిగా మూతపడింది.

(వివరాలు 2లో..)

# ఐరాస మ్యాప్‌లో సరిహద్దుల కలకలం

## అరుణాచల్, అక్సాయ్‌చిన్‌కు ప్రత్యేక గుర్తింపు



అరుణాచల్‌ప్రదేశ్, అక్సాయ్‌చిన్‌లను భారత్‌చైనా వాదిస్తున్న సరిహద్దుల మధ్య ప్రత్యేక ప్రాంతాలుగా చూపిస్తూ ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన కొత్త ప్రపంచ పటం చర్చకు దారితీసింది. 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానానికి భారత్ మద్దతు తెలిపిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

(వివరాలు 3లో..)

# స్పీకర్‌కు అవమానం

## బీఆర్ఎస్‌పై సీఎం ఆగ్రహం

తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యల వివాదం రాజకీయంగా మరింత ముదురుతోంది. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి తీవ్రంగా స్పందించారు. బాధ్యులెవరైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల విరామ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. గత రోజు జరిగిన పరిణామాలపై విచారం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని స్పీకర్‌కు భరోసా ఇచ్చారు. స్పీకర్‌ను అవమానించేలా జరిగిన ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని స్పష్టం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకునే విషయంలో వెనక్కి తగ్గేది లేదని తేల్చిచెప్పారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్



ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

# తాతా మధు, నవీన్ సస్పెన్షన్

## సమావేశాలు పూర్తయ్యే వరకు వేటు

తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణ వివాదం కీలక మలుపు తీసుకుంది. శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది.

(వివరాలు 2లో..)





# స్పీకర్ వ్యాఖ్యలపై భట్టి ఫైర్

## సభకే అవమానమన్న డిప్యూటీ సీఎం

స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్రంగా వ్యాఖ్యానించారు. మంగళవారం అసెంబ్లీలో మాట్లాడిన ఆయన.. ఈ వ్యాఖ్యలు కేవలం స్పీకర్‌ను లక్ష్యంగా చేసుకున్నవి కాదని, యావత్ శాసనసభకు జరిగిన అవమానమని అన్నారు. ఈ ఘటనతో బీఆర్ఎస్ భావజాలం, ఆ పార్టీ నేతల ఆలోచనా విధానం స్పష్టంగా బయటపడిందని విమర్శించారు.

(వివరాలు 2లో..)

# అరెస్టులపై కోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు ఊరట

## రిమాండ్ తిరస్కరణ.. వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల

అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఉద్రిక్తతల కేసులో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలకు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. పోలీసులు కోరిన రిమాండ్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. మంగళవారం ఉదయం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. ఇద్దరినీ వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేయాలని ఆదేశించింది.

(వివరాలు 2లో..)



# పాత చరిత్ర చెరిపేసి ప్రపంచం ముందుకు

6లో..

- పట్టాయా కొత్త ముఖచిత్రం
- లింకన్ రాకతో బిజినెస్ హంగామా

ఒకప్పుడు పేరు వినగానే రాత్రి వెలుగులు.. బార్ల హోరు.. గోగో క్లబ్బుల సందడి.. సెక్స్ టూరిజం గుర్తుకొచ్చేది. అమెరికా సైనికుల విశ్రాంతి కేంద్రంగా మొదలై ప్రపంచంలోనే అత్యంత చర్చనీయాంశమైన నైట్‌లైఫ్ నగరంగా ముద్రపడిన పట్టాయా ఇప్పుడు అదే ప్రపంచానికి మరో ముఖాన్ని చూపిస్తోంది. సముద్రపు అలల మధ్య పాత చరిత్రను వెనక్కి నెట్టుతూ.. కుటుంబ పర్యాటకం, లగ్జరీ రిసార్టులు, వాటర్ పార్కులు, ప్రకృతి ఉద్యానవనాలు, షాపింగ్ మాల్స్‌తో కొత్త పట్టాయా రూపుదిద్దుకుంటోంది. అయితే పాత ముద్ర అంత ఈజీగా చెరిగిపోలేదు. వాకింగ్ స్ట్రీట్‌లో రాత్రి వెలుగులు ఇంకా ఆ కథను చెబుతూనే ఉన్నాయి. ఇంతలో నెలల తరబడి సముద్రంలో విధులు నిర్వహించిన సుమారు 5 వేల మంది సిబ్బందితో అమెరికా భారీ యుద్ధనౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ పట్టాయా తీరానికి చేరడం ప్రపంచ దృష్టిని మళ్లీ ఈ నగరంపైకి తిప్పింది. సోషల్ మీడియాలో పాత పట్టాయాపై జోకులు పేలుతున్నా.. నేలపై కనిపిస్తున్న దృశ్యం మాత్రం భిన్నం. సైనిక చరిత్ర నుంచి సెక్స్ టూరిజం వరకు.. అక్కడి నుంచి కుటుంబ పర్యాటకం వరకు.. పట్టాయా ఇప్పుడు తన పాత ముద్రతోనే కొత్త ముఖచిత్రాన్ని ఆవిష్కరిస్తోంది.

# కేబినెట్ కదలికలపై మహేశ్ గౌడ్ క్లారిటీ

## శాఖలన్నీ మార్చాలని హైకమాండ్‌కు చెప్పా



తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు కొనసాగుతున్న వేళ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గాంధీ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత మంత్రివర్గంలోని శాఖలను ..



# రాజధాని వాసులకు 24 గంటల బస్సులు

## నైట్ సర్వీసులకు భారీ స్పందన:పొన్నం

హైదరాబాద్ నగరవాసులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గ్రేటర్ హైదరాబాద్‌లో అర్ధరాత్రి వేళల్లోనూ ప్రజా రవాణా అందుబాటులో ఉండేలా టీజీఎస్ఆర్టీసీ నైట్ షిఫ్ట్ బస్సు సర్వీసులను మరిన్ని రూట్లకు విస్తరించేందుకు నిర్ణయించింది.

(వివరాలు 2లో..)

# బంజారాహిల్స్-గచ్చిబౌలికి భారీ ఫ్లైఓవర్

## 9 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్



# స్పీకర్ వ్యాఖ్యలపై భట్టి ఫైర్

## సభకే అవమానమన్న డిప్యూటీ సీఎం



స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్రంగా వ్యాఖ్యానించారు. మంగళవారం అసెంబ్లీలో మాట్లాడిన ఆయన.. ఈ వ్యాఖ్యలు కేవలం స్పీకర్‌ను లక్ష్యంగా చేసుకున్నవి కాదని, యావత్ శాసనసభకు జరిగిన అవమానమని అన్నారు. ఈ ఘటనతో బీఆర్ఎస్ భావజాలం, ఆ పార్టీ నేతల ఆలోచనా విధానం స్పష్టంగా బయటపడిందని విమర్శించారు. సభాపతిని అవమానించడం అంటే మొత్తం సభను అవమానించినట్లేనని భట్టి పేర్కొన్నారు. దళిత వర్గాల్లో పుట్టి ఎదిగిన గడ్డం ప్రసాద్ సభాపతి స్థానంలో ఉన్నారని గుర్తుచేశారు. శాసనసభకు సుదీర్ఘ చరిత్ర ఉందని, ఫ్యూడల్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఈ సభకు ఉందని అన్నారు. అలాంటి సభ గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

**తాతా మధు, నవీన్ రెడ్డిపై చర్యలు**

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో తాతా మధు, నవీన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సభ తీర్మానించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆయన బలపరిచారు. ఆ తీర్మానాన్ని మండలి ఛైర్మన్‌కు పంపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇదే సమయంలో బీఆర్ఎస్‌పై భట్టి తీవ్ర రాజకీయ విమర్శలు చేశారు. ఫ్యూడల్ భావజాలం నుంచే బీఆర్ఎస్ పుట్టిందని ఆరోపించారు. ప్రస్తుతం "ఫాంహౌజ్ కుట్ర" నడుస్తోందని వ్యాఖ్యానించారు. సభలో సభ్యుల ప్రవర్తనకు కొన్ని హద్దులు ఉంటాయని, రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్ గౌరవాన్ని కాపాడటం అందరి బాధ్యత అని అన్నారు. ఈ వ్యవహారంపై సభ ఇప్పటికే చర్యలకు సిద్ధమైన నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. తాజా పరిణామాలతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మరింత తీవ్రం కానుంది.



# అరెస్టులపై కోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు ఊరట

## రిమాండ్ తిరస్కరణ.. వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల

అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఉద్రిక్తతల కేసులో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలకు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. పోలీసులు కోరిన రిమాండ్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. మంగళవారం ఉదయం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. ఇద్దరినీ వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేయాలని ఆదేశించింది. ఒక్కొక్కరు రూ.10 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు ఇద్దరు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. అవసరమైన పూచీకత్తు, ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఎమ్మెల్సీలను విడుదల చేశారు. అసెంబ్లీ వద్ద సోమవారం జరిగిన ఘటనకు సంబంధించిన దృశ్యాలను అసెంబ్లీ లీగల్ టీమ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఎమ్మెల్సీల తరఫు న్యాయవాదులు కేసులు రాజకీయ కక్షసాధింపులో భాగమని వాదించినట్లు తెలుస్తోంది. పోలీసులు మాత్రం కేసు నమోదు చేసిన కారణాలను కోర్టుకు వివరించారు.

**స్పీకర్‌పై వ్యాఖ్యలతో మొదలైన వివాదం**

సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన నిరసన సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై కేసు నమోదైంది. స్పీకర్ ఓఎస్డీ పోలేపల్లి వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బీఎన్ఎస్ సెక్షన్ 352, 3(5), ఎస్సీ/ఎస్టీ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధిస్తూ కఠిన పదజాలం ఉపయోగించారన్న ఆరోపణలపై ప్రసాద్ కుమార్ సభలో ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీరు పెట్టుకున్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీల సభ్యత్వం రద్దు చేయాలని అధికారపక్షం డిమాండ్ చేసింది. మరోవైపు అసెంబ్లీ వద్ద ఎమ్మెల్యేలను అడ్డుకోవడంపై బీఆర్ఎస్ నేతలు హైకోర్టును ఆశ్రయించిన అంశం కూడా కొనసాగుతోంది. ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దని, పోలీసుల ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు గతంలో ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవరించాలని ప్రభుత్వం కోరగా, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే పోలీసులు అడ్డుకున్నారని ప్రభుత్వ తరపు వాదనలు వినిపించాయి. తాజా కోర్టు తీర్పుతో ఎమ్మెల్సీల అరెస్టు వ్యవహారం కొత్త మలుపు తిరిగింది.

# తాతా మధు, నవీన్ సస్పెన్షన్

- సమావేశాలు పూర్తయ్యే వరకు వేటు
- తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణ వివాదం





కీలక మలుపు తీసుకుంది. శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు పూర్తయ్యే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. ఇద్దరిపై చర్యలకు మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టగా, ఛైర్మన్ మూజువాణి ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించడంతో ఇద్దరు ఎమ్మెల్సీలను సెషన్ మొత్తం సస్పెండ్ చేశారు.

అంతకుముందు ఇదే వ్యవహారంపై శాసనసభ కూడా తీర్మానం చేసింది. మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశపెట్టిన తీర్మానంలో స్పీకర్ పదవి గౌరవాన్ని తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని సభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించారని అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలను కూడా సభ ఖండించింది. బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు.

**కోర్టు నుంచి విడుదల.. మండలిలోకి రాగానే**

అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనపై తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. అయితే పోలీసుల రిమాండ్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేయాలని ఆదేశిస్తూ ఒక్కొక్కరికి రూ.10 వేల బాండ్, ఇద్దరు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరూ విడుదలయ్యారు. అనంతరం వారు శాసనమండలికి హాజరుకాగా అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేయడంతో సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీల సస్పెన్షన్‌ను ఆ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది.

# ఎర్రవల్లి కేసీఆర్ ఇల్లు ముట్టడి

## కాంగ్రెస్ పిలుపుతో ఉద్రిక్తత



కేసీఆర్ ఎర్రవల్లి నివాసం ముట్టడికి కాంగ్రెస్ నేతలు ఇచ్చిన పిలుపు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కేసీఆర్ ఇంటి వైపు వెళ్తున్న కాంగ్రెస్ నేతలను బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట, రాళ్లదాడి జరిగింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎర్రవల్లికి వస్తున్నారన్న సమాచారంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అప్రమత్తమై అసెంబ్లీ నుంచి అక్కడికి బయల్దేరారు. అయితే బొల్లారం వద్ద భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లి వైపు నడుచుకుంటూ వెళ్లారు. హకీంపేట్ దాటిన తర్వాత పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కేటీఆర్‌ను బోయిన్‌పల్లి పీఎస్‌కు, హరీశ్‌రావును జవహర్‌నగర్ పీఎస్‌కు తరలించారు. ఇద్దరినీ విడుదల చేసిన తర్వాత వారు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**కేటీఆర్ ఫైర్.. కాంగ్రెస్‌పై తీవ్ర ఆరోపణలు**

బోయిన్‌పల్లి పీఎస్ నుంచి విడుదలైన కేటీఆర్.. కాంగ్రెస్ గుండాలను కేసీఆర్ ఇంటిపైకి పంపించారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలపై హేయంగా దాడి చేశారని విమర్శించారు. 600కు పైగా హామీలు ఇచ్చి వెయ్యి రోజులు దాటినా వాటిని నెరవేర్చలేదని రేవంత్ సర్కారుపై ధ్వజమెత్తారు. "స్కూటీలు ఇస్తామన్నారు.. లూటీలు చేశారు" అంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణ దశాబ్దాల కలను కేసీఆర్ నెరవేర్చారని, హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో విశ్వనగరంగా నిలబెట్టారని కొనియాడారు. మరోవైపు హరీశ్‌రావు.. ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. "డైవర్షన్ పాలిటిక్స్‌తో హెడ్‌లైన్లు మారుతాయి.. ప్రజల జీవితాలు మారవు" అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో క్రాప్ హాలిడే పరిస్థితి వచ్చిందని, యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉద్యోగులు ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు నిలిచిపోయాయని విమర్శించారు.

**పీఎస్‌ల ఎదుట పోటాపోటీ నినాదాలు**

కేటీఆర్‌ను బోయిన్‌పల్లి పీఎస్‌కు తరలించిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా చేరడంతో ఇరువర్గాల మధ్య నినాదాలు, తోపులాటతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బీఆర్ఎస్ నేతలకు పోలీస్‌స్టేషన్‌లోనే రక్షణ లేదంటూ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. కొందరు పీఎస్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జవహర్‌నగర్ పీఎస్ వద్ద కూడా ఇదే తరహా పరిస్థితి నెలకొంది. హరీశ్‌రావు విడుదల కోరుతూ బీఆర్ఎస్ శ్రేణులు స్టేషన్ ఎదుట బైఠాయించాయి. పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాటతో ఉద్రిక్తత మరింత పెరిగింది. ఈ పరిణామాల ప్రభావంతో హైదరాబాద్ సిద్దిపేట రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. శామీర్‌పేట వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కేసీఆర్ ఇంటి ముట్టడి పిలుపు మొదలైన వివాదం.. చివరకు అరెస్టులు, ఘర్షణలు, రహదారుల దిగ్బంధానికి దారితీయడం తెలంగాణ రాజకీయ వేడిని మరో స్థాయికి తీసుకెళ్లింది.

# కేబినెట్ కదలికలపై మహేశ్ గౌడ్ క్లారిటీ

## శాఖలన్నీ మార్చాలని హైకమాండ్‌కు చెప్పా



తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు కొనసాగుతున్న వేళ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గాంధీ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత మంత్రివర్గంలోని శాఖలను సమూలంగా పునర్వ్యవస్థీకరించి, మంత్రులకు కొత్త శాఖలు కేటాయించాలని కాంగ్రెస్ హైకమాండ్‌కు తాను సూచించినట్లు వెల్లడించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా తన పరిధిలో పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ సలహా ఇచ్చానని చెప్పారు. అయితే శాఖల మార్పు, కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై తుది నిర్ణయం తీసుకునే అధికారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానానిదేనని స్పష్టం చేశారు. దీంతో త్వరలోనే తెలంగాణ కేబినెట్‌లో మార్పులు చోటుచేసుకోనున్నాయా? అన్న చర్చ మరింత ఊపందుకుంది.

**మంత్రి పదవిపై అధిష్ఠానానిదే నిర్ణయం**

ఇక తనకు మంత్రి పదవి దక్కుతుందన్న ప్రచారంపైనా మహేశ్ గౌడ్ స్పందించారు. "నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయం" అంటూ ఈ అంశాన్ని పార్టీ పెద్దలకే వదిలేశారు. ప్రస్తుతం తనకు అప్పగించిన పీసీసీ అధ్యక్ష బాధ్యతలపైనే పూర్తి దృష్టి పెట్టినట్లు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేయడం, సంస్థాగతంగా కాంగ్రెస్‌ను పటిష్ఠం చేయడం తన ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు. తాను మంత్రి పదవి కోసం ప్రయత్నించడం లేదన్న సంకేతాన్ని తాజా వ్యాఖ్యల ద్వారా ఇచ్చారు. మరోవైపు మంత్రుల శాఖలను మార్చాలని తానే అధిష్ఠానానికి సూచించినట్లు చెప్పడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం, అధిష్ఠానం ఆమోదంతో కేబినెట్‌లో మార్పులు జరిగే అవకాశం ఉందన్న ఊహాగానాలకు ఈ వ్యాఖ్యలు మరింత బలం చేకూర్చాయి. దీంతో కేబినెట్ విస్తరణలో ఎవరికి చోటు దక్కుతుంది? ప్రస్తుత మంత్రుల శాఖలు ఎవరికి మారతాయి? మహేశ్ గౌడ్‌కు మంత్రి పదవి వస్తుందా? అన్న అంశాలు తెలంగాణ కాంగ్రెస్‌లో హాట్‌టాపిక్‌గా మారాయి.

# రాజధాని వాసులకు 24 గంటల బస్సులు

## నైట్ సర్వీసులకు భారీ స్పందన:పొన్నం





అబిడ్స్, లక్డికాపూల్, కేర్ హాస్పిటల్, అన్నపూర్ణ, ఉషాకిరణ్, గుట్లబేగంపేట్, కొండాపూర్ క్రాస్‌రోడ్, హఫీజ్‌పేట్, లింగంపల్లి, రామచంద్రాపురం, బీరంగుడి మీదుగా పటాన్‌చెరు వరకు బస్సులు నడుస్తున్నాయి. కేవలం ఏడు రోజుల్లోనే 9,286 మంది ఈ నైట్ సర్వీసులను వినియోగించుకున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అర్ధరాత్రి సమయంలోనూ సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందుబాటులోకి రావడంతో ప్రయాణికుల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు.

**మరిన్ని రూట్లకు థర్డ్ షిఫ్ట్**

ప్రస్తుతం నడుస్తున్న రాత్రి బస్సులకు వచ్చిన స్పందనతో మరిన్ని మార్గాల్లో సర్వీసులు ప్రారంభించాలని ప్రయాణికుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని మంత్రి తెలిపారు. రద్దీ, ప్రయాణికుల డిమాండ్, ఆయా రూట్ల అవసరాలను సమగ్రంగా పరిశీలించి మరిన్ని ప్రధాన మార్గాలకు నైట్ సర్వీసులను విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులు, విద్యార్థులు, ఆస్పత్రులు, విమానాశ్రయం, వ్యాపార ప్రాంతాలకు రాత్రివేళ ప్రయాణించే ప్రజలకు ఈ నిర్ణయం ఎంతో ఉపయోగపడనుంది. ప్రస్తుతం ఉన్న సర్వీసుల అనుభవాన్ని పరిశీలిస్తూ దశలవారీగా కొత్త మార్గాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. నగరంలో రాత్రివేళ ఆటోలు, క్యాబ్‌లపై ఆధారపడే పరిస్థితిని కొంతవరకు తగ్గించడంతో పాటు సాధారణ ప్రజలకు తక్కువ ఖర్చుతో ప్రయాణించే అవకాశం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. హైదరాబాద్‌లో 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# బంజారాహిల్స్-గచ్చిబౌలికి భారీ ఫ్లైఓవర్

## 9 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్

హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో పెరుగుతున్న ట్రాఫిక్‌కు చెక్ పెట్టేందుకు హెచ్ఎండీఏ భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. బంజారాహిల్స్ నుంచి గచ్చిబౌలిలోని శిల్పా లేఅవుట్ వరకు దాదాపు 9 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనుంది. ఇందుకోసం తాజాగా టెండర్లను ఆహ్వానించింది. అర్హులైన కాంట్రాక్టర్లు ఈ నెల 22లోపు బిడ్లు దాఖలు చేయాలని అధికారులు సూచించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత పనులు ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.1,656 కోట్లు ఖర్చు చేయనున్నారు. మొత్తం పనులను రెండు దశల్లో పూర్తి చేసేలా డీపీఆర్ రూపొందించారు. తొలిదశలో ఫిలింనగర్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు 5 కిలోమీటర్ల కారిడార్ నిర్మిస్తారు. రెండో దశలో బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి హకీంపేట్ కుంట వరకు 4 కిలోమీటర్ల మార్గాన్ని అభివృద్ధి చేయనున్నారు. భవిష్యత్‌లో మెట్రో రైలు విస్తరణ జరిగినా ఇబ్బంది లేకుండా కారిడార్‌ను డిజైన్ చేయడం ఈ ప్రాజెక్టులో మరో కీలక అంశంగా అధికారులు చెబుతున్నారు.

**ఆరు ర్యాంపులతో ట్రాఫిక్‌కు ఊరట**

కొత్త ఎలివేటెడ్ కారిడార్‌పై రాకపోకలు సులభంగా సాగేందుకు ఆరు కీలక ప్రాంతాల్లో ర్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. ఫిలింనగర్ రోడ్డు నంబర్ 82, నార్నే రోడ్, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 52, ఐటీసీ కోహినూర్ రోడ్, టీహబ్ జంక్షన్, మైండ్‌స్పేస్ ప్రాంతాల్లో వీటిని నిర్మిస్తారు. కారిడార్ అందుబాటులోకి వస్తే బంజారాహిల్స్, జూబ్లీ చెక్‌పోస్టు, ఫిలింనగర్ మీదుగా గచ్చిబౌలి వైపు వెళ్లే వాహనదారులకు భారీ ఊరట లభించనుంది. ప్రస్తుతం ఈ మార్గాల్లో పీక్ అవర్స్‌లో తీవ్ర రద్దీ నెలకొంటుండటంతో ప్రయాణికులు ఎక్కువ సమయం రోడ్డుపైనే గడపాల్సి వస్తోంది. కొత్త మార్గంతో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. నగర నడిబొడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్ జంక్షన్ వైపు వెళ్లే ప్రయాణం కూడా మరింత సులభం కానుంది. ప్రయాణ సమయం తగ్గడం, కీలక జంక్షన్లపై వాహనాల ఒత్తిడి తగ్గడం ఈ ప్రాజెక్టు ప్రధాన ప్రయోజనాలుగా నిలవనున్నాయి.

# కేసీఆర్ హత్యకు కుట్ర

**కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్తుండగా కేటీఆర్ అరెస్ట్**



అసెంబ్లీ నుంచి కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎర్రవల్లి బయలుదేరగా తొలుత బొల్లారం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం హకీంపేట వద్ద వారిని నిలిపివేయడంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు అనుమతించకపోయినా నేతలు వెనక్కి తగ్గలేదు. బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లి వైపు పాదయాత్రగా వెళ్లేందుకు ప్రయత్నించడంతో కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకుని జవహర్‌నగర్, బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్లకు తరలించారు. డీజీపీ దీనిపై స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనపెట్టి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. అసెంబ్లీని కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి ఉపయోగించాలని సూచించారు. దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. దళితబంధు కింద రూ.12 లక్షల హామీని కూడా అమలు చేయలేదని ఆరోపించారు.

**హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతల అరెస్టులు**

కేటీఆర్‌తో పాటు హరీశ్‌రావు, పలువురు ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసీఆర్ భద్రతపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. కేసీఆర్ ఇంటి వద్దకు కాంగ్రెస్ కార్యకర్తలు చేరుకునేలా పోలీసులు అనుమతించడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. తమ నాయకుడికి ఏదైనా జరిగితే రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మరోవైపు మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఇంటిపై దాడికి కాంగ్రెస్ శ్రేణులను ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ చావును కోరుకుంటున్నారంటూ హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కేసీఆర్‌కు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

**బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద రణరంగం**

కేటీఆర్ సహా బీఆర్ఎస్ నేతలను బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో అక్కడ ఉద్రిక్తత తీవ్రరూపం దాల్చింది. బీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా చేరుకున్న సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా అక్కడికి రావడంతో నినాదాలు, వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. పరిస్థితి అదుపు తప్పడంతో బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద రణరంగం నెలకొంది. ఇరువర్గాలు రాళ్లు, కుర్చీలు విసురుకున్నట్లు సమాచారం. ఈ ఘర్షణలో పలువురికి గాయాలైనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌కు చెందిన ఓ మహిళా కార్యకర్త చేతికి తీవ్ర గాయమైందని, చేయి విరిగినట్లు సమాచారం. ఎమ్మెల్యే శంకర్‌పై కేసు నమోదు చేసి సభ్యత్వం రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు అదనపు బలగాలను మోహరించి ఇరువర్గాలను చెదరగొట్టారు.



# హిందూ గ్రూప్ ఈఫిల్ టవర్ రగడ

- మహిళలను పక్కకు తప్పించడంపై రచ్చ
- బీఏపీఎస్ వివాదంపై కేంద్రం రియాక్షన్

**ఎందుకు ఈ పరిస్థితి వచ్చింది?**

ఎఫిల్ టవర్ నిర్వహణ సంస్థ ఎస్ఈటీఈ ప్రకారం, బీఏపీఎస్ ప్రతినిధులు పర్యటన సందర్భంగా మహిళలతో పరస్పర సంబంధాలను సాధ్యమైనంత వరకు పరిమితం చేయాలని కోరినట్లు వెల్లడించింది. అలాంటి షరతులను అంగీకరించడం తప్పేనని ఎస్ఈటీఈ స్పష్టం చేసింది. పురుషులు, మహిళలకు సమానత్వం అనే ఫ్రాన్స్ విలువలకు ఇది విరుద్ధమని పేర్కొంది. సంస్థ అధ్యక్షుడు ఏరియల్ వెయిల్ కూడా ఈ విధానం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై పారిస్ అధికారులు దర్యాప్తుకు ఆదేశించారు. ఫ్రాన్స్ సమానత్వ శాఖ మంత్రి ఆరోర్ బెర్జ్ తీవ్రంగా స్పందిస్తూ మహిళలు తమ ఉనికిని దాచుకోవాలని ఫ్రాన్స్‌లో ఎవరూ చెప్పలేరని అన్నారు. ఫ్రాన్స్ రాజకీయ వర్గాల్లోనూ ఈ ఘటనపై విమర్శలు వెల్లువెత్తాయి.

**భారత్ ఏమంది?**

ఈ వివాదంపై భారత విదేశాంగ శాఖ మాత్రం బీఏపీఎస్ ఆలయం ప్రారంభోత్సవం, ఎఫిల్ టవర్ ఘటన రెండింటినీ వేర్వేరు అంశాలుగా చూసింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ ఎఫిల్ టవర్‌కు సంబంధించిన వ్యవహారం సంబంధిత సంస్థల మధ్య ఉన్న అంశమని స్పష్టం చేశారు. పారిస్ ప్రాంతంలో బీఏపీఎస్ ఆలయం ప్రారంభమైన విషయం తమకు తెలుసని తెలిపారు. ఆలయ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శుభాకాంక్షలు చెప్పడం సాధారణ ప్రభుత్వ విధానంలో భాగమేనని చెప్పారు. ఎఫిల్ టవర్ వివాదంపై కేంద్రం ఎలాంటి ప్రత్యేక వ్యాఖ్య చేయలేదు.

**బీఏపీఎస్ వివరణ ఏమిటి?**

వివాదం తర్వాత బీఏపీఎస్ స్పందిస్తూ తమపై వచ్చిన ఆందోళనలను గౌరవిస్తున్నామని, విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపింది. తమ ప్రతినిధుల సంఖ్య పెద్దగా ఉండటంతో సాధారణ సందర్శకులకు ఇబ్బంది కలగకుండా ఎఫిల్ టవర్ సిబ్బందితో సమన్వయం చేసుకుని పర్యటన ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఎవరినీ ఎఫిల్ టవర్‌లోకి రాకుండా అడ్డుకోలేదని తెలిపింది. అయితే ఈ ఘటనతో ఎవరికైనా ఇబ్బంది కలిగితే క్షమాపణలు చెబుతున్నామని స్పష్టం చేసింది. పరస్పర గౌరవం, సేవాభావం వంటి విశ్వవ్యాప్త విలువలకు తాము కట్టుబడి ఉన్నామని బీఏపీఎస్ ప్రకటించింది.

**అసలు వివాదం ఏమిటంటే?**

ఈ వ్యవహారంలో ప్రధాన ప్రశ్న మత విశ్వాసాల పేరుతో మహిళా ఉద్యోగుల విధులను పరిమితం చేయడం ఎంతవరకు సమంజసం? అన్నదే. బీఏపీఎస్ తన పర్యటనలో మహిళలతో పరస్పర సంబంధాలను తగ్గించాలని కోరిందన్నది ఎస్ఈటీఈ వాదన. ఆ షరతులను అమలు చేయడం ద్వారా మహిళలను విధుల నుంచి తప్పించారన్నది సిబ్బంది ఆరోపణ. మరోవైపు బీఏపీఎస్ మాత్రం తాము ఎవరినీ నిరోధించలేదని వివరణ ఇచ్చింది. దీంతో ఘటనపై ఫ్రాన్స్‌లో లింగ సమానత్వం, మత స్వేచ్ఛ, సంస్థల బాధ్యత వంటి అంశాలపై పెద్ద చర్చ మొదలైంది.

# జిల్లాలే ఎగుమతి కేంద్రాలు

## గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్న కేంద్రం

- రూపాంతరం చెందిన వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్
- స్థానిక ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్ సౌకర్యం
- ఎగుమతిదారులకు శిక్షణ.. ఎగుమతులకు ప్రోత్సాహం

భారత్ ఎగుమతులను కొన్ని పారిశ్రామిక కేంద్రాలు, ఓడరేవు నగరాలకే పరిమితం చేయకుండా ప్రతి జిల్లానూ ప్రపంచ వాణిజ్యంతో అనుసంధానించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. 'ఎగుమతి కేంద్రాలుగా జిల్లాలు' కార్యక్రమం ద్వారా స్థానికంగా ప్రత్యేకత కలిగిన ఉత్పత్తులు, సేవలను గుర్తించి, వాటికి అంతర్జాతీయ మార్కెట్లలో స్థానం కల్పిస్తోంది. జిల్లా స్థాయిలో మౌలిక సదుపాయాలు, నాణ్యతా ప్రమాణాలు, ప్యాకేజింగ్, బ్రాండింగ్, రవాణా వ్యవస్థలను మెరుగుపరచడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, ఆదాయ అవకాశాలు పెంచడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం.

### రికార్డు స్థాయికి భారత ఎగుమతులు

భారత ఆర్థిక వృద్ధిలో ఎగుమతులు కీలక చోదక శక్తిగా నిలుస్తున్నాయి. దేశ వస్తు, సేవల మొత్తం ఎగుమతులు 2024-25లో రికార్డు స్థాయిలో 825.25 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరాయి. 2025-26లో ఇవి 863.11 బిలియన్ అమెరికన్ డాలర్లకు పెరిగినట్లు అంచనా. విదేశీ మార్కెట్ల నుంచి వచ్చే ఆదాయం దేశీయ పరిశ్రమల విస్తరణ, కొత్త ఉపాధి, స్థానిక ఆదాయ వృద్ధికి ఊతమిస్తోంది. ఈ ప్రగతిని దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు జిల్లా ఆధారిత ఎగుమతి నమూనాను ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది.

### గ్రామీణ ఉత్పత్తులకు ప్రపంచ అవకాశాలు

దేశంలోని చిన్న పట్టణాలు, గ్రామీణ జిల్లాలు, మారుమూల ప్రాంతాల్లో అంతర్జాతీయ స్థాయి సామర్థ్యం కలిగిన అనేక ఉత్పత్తులు ఉన్నాయి. సరైన మార్కెట్ సమాచారం, నాణ్యతా ధ్రువీకరణ, రవాణా సౌకర్యం లేకపోవడంతో గతంలో ఇలాంటి ఉత్పత్తులు ఎగుమతి మార్కెట్లను చేరలేకపోయాయి. డీఈహెచ్ కార్యక్రమం ఈ లోటును అధిగమిస్తూ స్థానిక ఉత్పత్తిదారులను ప్రపంచ కొనుగోలుదారులతో అనుసంధానిస్తోంది.

### ఓడీఓపీగా మొదలై డీఈహెచ్‌గా రూపాంతరం

'ఎగుమతి కేంద్రాలుగా జిల్లాలు' కార్యక్రమానికి 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' భావనే పునాది. 2018లో ఉత్తరప్రదేశ్‌లో ప్రారంభమైన ఓడీఓపీ కార్యక్రమం ప్రతి జిల్లాలోని ప్రత్యేక ఉత్పత్తికి బ్రాండ్ గుర్తింపు, మార్కెట్ అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టింది. మొరాదాబాద్ ఇత్తడి పరిశ్రమను కేంద్రంగా చేసుకొని రూపుదిద్దుకున్న ఈ నమూనా తర్వాత దేశవ్యాప్తంగా విస్తరించింది. విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ పరిధిలో డీఈహెచ్ కార్యక్రమం ద్వారా ఉత్పత్తుల ప్రచారం నుంచి సమగ్ర ఎగుమతి వ్యవస్థ నిర్మాణం వరకు లక్ష్యాలను విస్తరించారు. 2026 జనవరి నాటికి 770కి పైగా జిల్లాలు ఈ కార్యక్రమ పరిధిలోకి వచ్చాయి. తెలంగాణలోని 31 జిల్లాలకు కూడా ఈ అవకాశం లభించింది.



### ప్రపంచ ప్రమాణాలే లక్ష్యం

ఉత్పత్తిని గుర్తించడం ఒక్కటే ఎగుమతి విజయానికి సరిపోదు. అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలు, పరీక్షలు, ప్యాకేజింగ్, బ్రాండింగ్, ధ్రువీకరణ నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ఈ అంశాలపై స్థానిక తయారీదారులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు డీఈహెచ్ అవగాహన, శిక్షణ అందిస్తోంది. ప్రపంచ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తుల నాణ్యతను పెంచడం ద్వారా జిల్లాల ఎగుమతి పోటీ సామర్థ్యాన్ని బలోపేతం చేస్తోంది. అమెజాన్, షిప్‌రాకెట్, డీహెచ్‌ఎల్ వంటి ఈ-కామర్స్ సంస్థలతో కుదిరిన భాగస్వామ్యాలు స్థానిక వ్యాపారాలకు తక్కువ ఖర్చుతో కూడిన రవాణా అవకాశాలను అందిస్తున్నాయి. మారుమూల ప్రాంతాల్లోని చిన్న సంస్థలు కూడా డిజిటల్ వేదికల ద్వారా విదేశీ కొనుగోలుదారులను చేరుకోగలుగుతున్నాయి. డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రాలు పత్రాల నిర్వహణ, ప్యాకేజింగ్, చిన్న సరకు రవాణా కోసం తక్కువ ఖర్చుతో కూడిన తపాలా ఎగుమతి సేవలను అందిస్తూ ఈ పరిధిని మరింత విస్తరిస్తున్నాయి.

### ఎగుమతిదారులకు నైపుణ్య శిక్షణ

రవాణా ప్రణాళిక, ఎగుమతి ప్రక్రియలు, ప్యాకేజింగ్ ప్రమాణాలు, నియంత్రణ నిబంధనలపై విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ ప్రాంతీయ కార్యాలయాలు, జిల్లా యంత్రాంగాలు సంయుక్తంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఈసీజీసీ, హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక మండలి, భారత ఎగుమతి సంస్థల సమాఖ్య, కేంద్ర ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వ శాఖ, భారత తపాలా విభాగం, ఎగ్జిమ్ బ్యాంక్ వంటి సంస్థలు సహకారం అందిస్తున్నాయి. చెల్లింపుల సమస్యలు, కొనుగోలుదారుల విశ్వసనీయత, ధ్రువీకరణ వంటి సవాళ్లపై కూడా ఎగుమతిదారులకు అవగాహన కల్పిస్తున్నాయి.

### ట్రిలియన్ డాలర్ల లక్ష్యం దిశగా

2026 జూన్ 1 నుంచి డీఈహెచ్ కార్యక్రమ అమలులో ఫలితాల ఆధారిత, లక్షిత, దశలవారీ విధానాన్ని ప్రభుత్వం చేపట్టింది. తొలి దశలో 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని జిల్లాలను ఎంపిక చేశారు. విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్‌కు చెందిన 24 ప్రాంతీయ కార్యాలయాలు, 11 భాగస్వామ్య సంస్థలు అమలుకు మద్దతు ఇస్తున్నాయి. కొత్త ఎగుమతిదారుల నమోదు, ఎగుమతుల విలువ పెంపు, స్థానిక ఉపాధి సృష్టి వంటి కొలవదగిన ఫలితాలపై దృష్టి సారించారు. ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఎగుమతి లక్ష్యం దిశగా భారత్ సాగుతున్న వేళ, ప్రతి జిల్లాను వాణిజ్యం, పెట్టుబడులు, ఉపాధికి కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించనుంది.



## బతుకమ్మపై యువ ప్రతిభకు వేదిక

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను ప్రపంచానికి చాటడంతో పాటు యువత సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026' నిర్వహిస్తున్నట్లు సినిమాటోగ్రఫీ, రోడ్లుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి.ముకుందరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్‌రెడ్డితో కలిసి ఛాలెంజ్ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులకు షార్ట్‌ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా ప్రతిభను చాటుకునే గొప్ప అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. బతుకమ్మ ప్రత్యేకత, తెలంగాణ జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా వీడియోలు రూపొందించవచ్చన్నారు. యువ ఫిలిం మేకర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచ వేదికపై చాటాలని మంత్రి కోమటిరెడ్డి పిలుపునిచ్చారు.

## ఇజ్రాయెల్‌పై యూకే కఠిన ఆంక్షలు

ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లపై బ్రిటన్ సంచలన నిర్ణయం తీసుకుంది. సెటిల్‌మెంట్ల నుంచి వస్తువుల దిగుమతులు, ఫైనాన్సింగ్, నిర్మాణ సేవలతో వాణిజ్య సంబంధాలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. యూకే నిర్ణయానికి ఫ్రాన్స్, కెనడా మద్దతు ప్రకటించాయి. పాలస్తీనియన్ల ఇళ్ల కూల్చివేత, రహదారులు, మౌలిక వసతుల ధ్వంసాన్ని బ్రిటన్ విదేశాంగ మంత్రి ఎడ్ మిలిబాండ్ తీవ్రంగా ఖండించారు. సెటిలర్ టెర్రరిస్టులు పాలస్తీనియన్లపై జాతి నిర్మూలనకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. లేబర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇజ్రాయెల్‌పై యూకే విదేశాంగ విధానంలో ఇదే అతిపెద్ద మార్పుగా విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఏడాది పాలస్తీనాను స్వతంత్ర దేశంగా బ్రిటన్ గుర్తించిన విషయం గమనార్హం. మరోవైపు యూకే నిర్ణయంపై ఇజ్రాయెల్, అమెరికా తీవ్రంగా మండిపడ్డాయి. దీనిని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ తీవ్రంగా తప్పుబట్టగా, విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ ప్రతీకార చర్యలపై హెచ్చరించారు. అమెరికా రాయబారి మైక్ హకబీ ఈ నిర్ణయాన్ని యూదులపై వివక్షగా అభివర్ణించారు. ఈ పరిణామాల మధ్య బ్రిటన్ ప్రధాని ఆండీ బర్న్‌హమ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

## స్కూల్ బస్సులో మంటలు

**హైదరాబాద్:** తెల్లాపూర్‌లోని మంథన్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన బస్సులో విద్యార్థులు ఎక్కుతుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి తీవ్ర కలకలం రేపాయి. ఒకటో తరగతి విద్యార్థులు బస్సు ఎక్కుతున్న సమయంలో మంటలు వ్యాపించడంతో అప్రమత్తమైన సిబ్బంది వెంటనే పిల్లలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. క్షణాల్లో మంటలు బస్సు మొత్తం వ్యాపించడంతో అది పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సిబ్బంది సకాలంలో స్పందించడంతో విద్యార్థులకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్, నిర్వహణపై సమగ్ర తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. బస్సు సరైన కండిషన్‌లో లేకపోవడం వల్లే మంటలు చెలరేగి ఉండొచ్చని కొందరు అనుమానం వ్యక్తం చేశారు. గతంలోనూ ఇదే పాఠశాలకు చెందిన మరో బస్సు దగ్ధమైన ఘటన జరిగిందని తల్లిదండ్రులు చెబుతున్నారు. దీంతో అన్ని బస్సుల్లో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, అత్యవసర ద్వారాలు, ఇతర భద్రతా పరికరాలు సక్రమంగా ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదానికి అసలు కారణం, బస్సు ఫిట్‌నెస్‌పై అధికారులు, పాఠశాల యాజమాన్యం స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

## మైనర్ గ్యాంగ్‌రేప్‌లో ఉరిశిక్ష

తిరునల్వేలి: మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ముగ్గురు నిందితుల్లో చిన్నకుట్టి (28)కి మరణశిక్ష విధించగా, మురుగేశన్ (23)కు 20 ఏళ్లు, మునీశ్వరన్ (25)కు 13 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేసింది. 2022లో 16 ఏళ్ల బాలికకు ప్రార్థనా స్థలంలో మునీశ్వరన్ పరిచయమయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను మీనాక్షిపురంలోని తన సోదరి ఇంటికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు ప్రాసిక్యూషన్ తెలిపింది. అనంతరం స్నేహితులైన చిన్నకుట్టి, మురుగేశన్‌ను అక్కడికి పిలిపించగా, వారు కూడా బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు పేర్కొంది. ఘటనను తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురినీ అరెస్ట్ చేసి దర్యాప్తు పూర్తి చేశారు. విచారణ అనంతరం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సురేశ్ కుమార్ మంగళవారం తుది తీర్పు ప్రకటించారు. నిందితుల్లో ఒకరికి ఉరిశిక్ష విధించడం రాష్ట్రంలో ఈ కేసును తీవ్రంగా చర్చనీయాంశంగా మార్చింది.

## ఐరాస మ్యాప్‌లో సరిహద్దుల కలకలం

### అరుణాచల్, అక్సాయ్‌చిన్‌కు ప్రత్యేక గుర్తింపు

అరుణాచల్‌ప్రదేశ్, అక్సాయ్‌చిన్‌లను భారత్‌చైనా వాదిస్తున్న సరిహద్దుల మధ్య ప్రత్యేక ప్రాంతాలుగా చూపిస్తూ ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన కొత్త ప్రపంచ పటం చర్చకు దారితీసింది. 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానానికి భారత్ మద్దతు తెలిపిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. జులై 1న తొలిసారి విడుదలైన ఈ మ్యాప్‌లో అరుణాచల్‌ప్రదేశ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా చూపించారు. పశ్చిమాన అసోం, ఉత్తరాన చైనా సరిహద్దుగా పేర్కొన్నారు. అదే సమయంలో అరుణాచల్‌ప్రదేశ్‌కు నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును మ్యాప్‌లో తొలగించారు. అక్సాయ్‌చిన్‌ను కూడా ప్రత్యేక ప్రాంతంగా చూపిస్తూ దాని పశ్చిమ వైపు భారత్, తూర్పు వైపు చైనా సరిహద్దులుగా సూచించారు. అక్సాయ్‌చిన్‌ను లడఖ్‌లో భాగంగా భారత్ పేర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ మార్పులకు కారణాలపై ఐరాస ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వలేదు.

**ఎల్‌ఓసీపై ఐరాస వివరణ**

జమ్మూ కశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉన్న నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ)ను కూడా కొత్త మ్యాప్‌లో చుక్కల రేఖతో చూపించారు. ఈ రేఖ భారత్, పాకిస్థాన్ అంగీకరించిన ఎల్‌ఓసీని సుమారుగా సూచిస్తుందని ఐరాస మ్యాప్ కింద వివరణ ఇచ్చింది.



జమ్మూ కశ్మీర్ తుది స్థితిపై సంబంధిత పక్షాల మధ్య ఇంకా అంగీకారం లేదని పేర్కొంది. ప్రపంచ ప్రాంతాలను పటాల్లో మరింత కచ్చితంగా, సమానంగా చూపించాలనే లక్ష్యంతో ఆఫ్రికన్ యూనియన్ మద్దతుతో 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానాన్ని ఐరాస సర్వసభ్య సమావేశం ఆమోదించింది. ఈ తీర్మానం చట్టబద్ధమైనది కాదు. అయితే అంతర్జాతీయ సంస్థలు ఉపయోగించే ప్రామాణిక ప్రపంచ పటాల్లో మార్పులకు ఇది దారితీయొచ్చు. ఆఫ్రికన్ గ్రూప్ తరఫున టోగో ఈ తీర్మానాన్ని ముందుకు తీసుకెళ్లగా భారత్ మద్దతు తెలిపింది. అయితే ఏదైనా నిర్దిష్ట మ్యాప్, ప్రొజెక్షన్ లేదా సరిహద్దుల చిత్రణకు ఈ తీర్మానం ఆమోదం కాదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. జమ్మూ కశ్మీర్, లడఖ్ సహా భారత సార్వభౌమ భూభాగాన్ని అధికారిక భారత మ్యాప్ ప్రకారమే చూపించాలని పేర్కొంటూ, తప్పుదోవ పట్టించే చిత్రణను అంగీకరించబోమని తేల్చిచెప్పింది.

## మోదీ పర్యటనలో తుపాకీ కలకలం

### పీఎంవో అధికారినంటూ నకిలీ ఎంట్రీ

ప్రధాని నరేంద్ర మోదీ ముంబై పర్యటనకు ముందు బాంద్రాకుర్లా కాంప్లెక్స్‌లో భద్రతా కలకలం చోటుచేసుకుంది. ప్రధాని పాల్గొననున్న కార్యక్రమ ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు తాను ప్రధాని కార్యాలయం (పీఎంవో) అధికారినంటూ చెప్పుకున్నట్లు సమాచారం. అతని వద్ద నకిలీ గుర్తింపు కార్డును పోలీసులు గుర్తించారు. ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ ప్రాంగణంలో వీరిని గుర్తించినట్లు అధికారిక వివరాలు వెల్లడించాయి. నకిలీ ఐడీ కార్డుతో పట్టుబడిన వ్యక్తిని 24 ఏళ్ల రోహన్ పరేఖ్‌గా గుర్తించారు. అతనితో ఉన్న అంగరక్షకుడి వద్ద తుపాకీ ఉన్నట్లు భద్రతా సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల సమయంలో ఐడీ కార్డు అనుమానాస్పదంగా కనిపించడంతో మరింత లోతుగా పరిశీలించగా అది నకిలీదని తేలింది. పీఎంవో అధికారినంటూ చెప్పుకోవడం వెనుక కారణమేంటి? తుపాకీతో ఉన్న బాడీగార్డుతో కలిసి ప్రధాని కార్యక్రమ ప్రాంగణంలోకి ఎందుకు రావాలనుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాల కోసం ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేస్తోంది.

### అసలు టార్గెట్ ఎవరు? దర్యాప్తు ముమ్మరం

ప్రస్తుతం ఈ ఇద్దరూ ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకునే ఉద్దేశంతోనే అక్కడికి వచ్చినట్లు ఎలాంటి అధికారిక సమాచారం లేదు. అయినప్పటికీ నకిలీ




గుర్తింపు కార్డు, తుపాకీతో ప్రధాని కార్యక్రమానికి చేరుకునే ప్రయత్నం చేయడం భద్రతా వర్గాలను అప్రమత్తం చేసింది. ఇదే సమయంలో సెప్టెంబర్ 8న సాయంత్రం 5:45 గంటలకు ముంబైలో ప్రధాని మోదీ గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026ను ప్రారంభించనున్నారు. సెప్టెంబర్ 8 నుంచి 11 వరకు జరిగే ఏడో ఎడిషన్‌లో ఫైనాన్స్ భవిష్యత్తు, ఏజెంటిక్ టెక్నాలజీ, టోకెనైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీ, డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సమ్మిళితంపై చర్చలు జరగనున్నాయి. అంతకుముందు గుజరాత్‌లోని వడోదరలో రూ.35 వేల కోట్లకుపైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకిత కార్యక్రమాల్లో ప్రధాని పాల్గొంటారు. ఇందులో రూ.20,700 కోట్లకుపైగా వ్యయంతో నిర్మించిన వెస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌లోని 326 రూట్ కిలోమీటర్ల మూడు కీలక విభాగాలు ఉన్నాయి. అయితే ముంబైలో జరిగిన ఘటన వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్నదే ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది.



## బైపోల్స్‌లో డీఎంకే ఎంట్రీ

- తమిళనాడులో త్రిముఖ పోరు!
- మూడు పార్టీల రసవత్తర పోటీ

తమిళనాడులోని మదురాంతకం, ధారాపురం అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికలు ఆసక్తికరంగా మారుతున్నాయి. అధికార తమిళగ వెట్రి కళగం (టీవీకే)తో పాటు ఇప్పటికే ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమైన అన్నాడీఎంకేకు ఇప్పుడు డీఎంకే కూడా పోటీకి దిగాలని నిర్ణయించడం కీలక పరిణామంగా మారింది. దీంతో రెండు నియోజకవర్గాల్లో త్రిముఖ పోరు తప్పనిసరిగా కనిపిస్తోంది. సాధారణ ఎన్నికల తర్వాత జరుగుతున్న ఈ ఉప ఎన్నికలను ప్రధాన ప్రతిపక్ష పార్టీగా డీఎంకే ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది.

**జిల్లా కార్యదర్శులతో స్టాలిన్ మంతనాలు**

ఉప ఎన్నికల వ్యూహంపై చర్చించేందుకు డీఎంకే అధిష్ఠానం జిల్లా కార్యదర్శులను చెన్నైకి ఆహ్వానించింది. అభ్యర్థుల ఎంపిక, నియోజకవర్గాల పరిస్థితి, పార్టీ బలాబలాలు, ఎన్నికల ప్రచార వ్యూహంపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. మదురాంతకం, ధారాపురం స్థానాలు ఖాళీ కావడానికి ప్రధాన కారణం అక్కడి అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు రాజీనామా చేసి టీవీకేలో చేరడమే. దీంతో ఈ రెండు స్థానాల్లో జరిగే ఉప ఎన్నికలు తమిళనాడు రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అన్నాడీఎంకే ఇప్పటికే ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. డీఎంకే పోటీకి దిగడంతో టీవీకేకు వ్యతిరేకంగా అన్నాడీఎంకేతో రహస్య అవగాహన చేసుకుంటుందనే ప్రచారానికి తెరపడింది.

**రహస్య ఒప్పందం ప్రచారానికి చెక్**

డీఎంకే పోటీ నుంచి తప్పుకుంటే అన్నాడీఎంకేతో లోపాయికారీ ఒప్పందం ఉందనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతుందని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉప ఎన్నికల నుంచి దూరంగా ఉండటం సాధ్యం కాదని డీఎంకే భావిస్తోంది. ఎన్నికలపై తమకు సందేహాలు ఉన్నాయనే సంకేతం వెళ్లకుండా బరిలో ఉండాలని నిర్ణయించింది. ఇదిలా ఉంటే, మదురాంతకం నుంచి గతంలో గెలిచిన మరగతం కుమారవేల్, ధారాపురం నుంచి గెలిచిన పీ. సత్యబామ మరోసారి అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఇద్దరూ రిజర్వ్‌డ్ నియోజకవర్గాల నుంచి గతంలో అన్నాడీఎంకే తరఫున పోటీ చేసి గెలిచారు. అయితే ఈసారి అన్నాడీఎంకే ఓటు బ్యాంకు వారికి ఎంతవరకు కలిసొస్తుందనేది కీలక ప్రశ్నగా మారింది.



## ప్యాకేజ్డ్ ఫుడ్‌పై వార్నింగ్ తప్పనిసరి

**రుచిగా కనిపించే ప్రతి ప్యాకెట్ ఆరోగ్యకరం కాదు! రంగురంగుల ప్రకటనలు, ఆకర్షణీయమైన ఆఫర్లు చూసి కొనుగోలు చేసే ఆహార పదార్థాల్లో చక్కెర, ఉప్పు, కొవ్వు మోతాదు ప్రమాదకర స్థాయిలో ఉండొచ్చు. మన పిల్లల టిఫిన్ బాక్స్ నుంచి పెద్దల రోజువారీ అల్పాహారం వరకు ప్యాకేజ్డ్ ఫుడ్ భాగమైపోయింది. కానీ ప్యాకెట్ వెనుక చిన్న అక్షరాల్లో దాగిన నిజం చాలామందికి కనిపించదు. అందుకే ఉత్పత్తి ముందుభాగంలోనే స్పష్టమైన హెచ్చరిక లేబుల్ ఉండాలని వినియోగదారులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఈ లేబుల్ కేవలం గుర్తు కాదు.. కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడే ముందస్తు హెచ్చరిక. మీరు కొనేది ఆహారమా? లేక నెమ్మదిగా ఆరోగ్యాన్ని దెబ్బతీసే ప్రమాదమా? తెలుసుకోవాల్సిన సమయం వచ్చింది.**

- ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు, పానీయాల్లో అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు ఉంటే ప్యాకెట్ ముందుభాగంలోనే స్పష్టమైన హెచ్చరిక లేబుల్ తప్పనిసరి చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. ఆగస్టు 28న ఎఫ్ఎస్ఎస్ఏఐ సుప్రీంకోర్టుకు సమర్పించిన ప్రతిపాదనలో రెడ్ హెక్సాగాన్ గుర్తుతో 'హై షుగర్', 'హై సాల్ట్', 'హై ఫ్యాట్' వంటి హెచ్చరికలు ఇవ్వాలని పేర్కొంది. అయితే తొలిదశలో రెండు లేదా అంతకంటే ఎక్కువ పోషకాలు అధికంగా ఉన్న ఉత్పత్తులకే హెచ్చరిక ఇవ్వాలని ప్రతిపాదించడం చర్చకు దారితీసింది. ఒక్క చక్కెర, ఉప్పు లేదా కొవ్వు అధికంగా ఉన్న ఉత్పత్తులకు రెండో దశ వరకు హెచ్చరిక ఉండకపోవచ్చని అధికారులు సూచించారు.
- దీనిపై లోకల్‌సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో 23,516 మందిలో 80 శాతం మంది మొదటి దశ నుంచే అన్ని అధిక పోషకాలకు హెచ్చరికలు ఉండాలని అభిప్రాయపడ్డారు.
- లేబుల్ పెద్దగా, స్పష్టంగా కనిపించాలని 88 శాతం మంది కోరారు. ఉత్పత్తిలోని మొత్తం చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఆధారంగానే హెచ్చరిక ఇవ్వాలని 53 శాతం మంది తెలిపారు. నిబంధనలను ఆరు నెలల్లో అమలు చేయాలని 88 శాతం మంది డిమాండ్ చేశారు. 328 జిల్లాల నుంచి 1.08 లక్షల మంది పాల్గొన్న సర్వేలో 62 శాతం మంది పురుషులు ఉన్నారు. ఆరోగ్యంపై ప్రభావం చూపే పదార్థాలను దాచిపెట్టకుండా, వినియోగదారులకు నిజం ముందే తెలియజేయాలన్నదే ప్రజల ప్రధాన డిమాండ్.

# మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడి.. చర్యలేవి?



**వారికి జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతుంది**

**దాడిపై అసెంబ్లీలో ప్రశ్నించిన హరీష్ రావు**

**నీ తల్లికి కాదు మా అమ్మకు అవమానం జరిగింది**

**ఘాటుగా బదులిచ్చిన స్పీకర్ గడ్డం ప్రసాద్**



అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై జరిగినట్లు చెబుతున్న దాడిపై బాధ్యులైన పోలీసులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రశ్నించారు. అక్కాచెల్లెమ్మలకు జరిగిన ఘటన చూస్తే గుండె తరుక్కుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కినట్లు, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగినట్లు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తున్నా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. బాధితులపైనే కేసులు నమోదు చేసి వేధించడం ఏమిటని నిలదీశారు. ఈ ఘటనపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ పోలీసులపై వచ్చిన ఆరోపణలను పరిశీలిస్తామని తెలిపారు. హరీష్‌రావు మాట్లాడుతూ ఇది మంచి పద్ధతి కాదని, గౌరవసభగా ఉండాల్సిన అసెంబ్లీ కౌరవ సభగా మారిందని మండిపడ్డారు. ఆనాడు కౌరవులకు పట్టిన గతే మీకూ పడుతుందని హెచ్చరించారు. ఇదే సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తనకు గౌరవం ఉందని హరీష్‌రావు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు కూడా స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేస్తూ, అలా భావించి ఉంటే తన మాటలను వెనక్కి తీసుకుంటున్నట్లు విచారం వ్యక్తం చేశారు.

**"అవమానం మా అమ్మకు జరిగింది"**

హరీష్‌రావు వ్యాఖ్యలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఘాటుగా బదులిచ్చారు. "నీ తల్లికి కాదు.. మా అమ్మకు అవమానం జరిగింది" అంటూ తీవ్రంగా స్పందించారు. మహిళా ప్రజాప్రతినిధులను ప్రభుత్వం గౌరవిస్తుందని స్పష్టం చేసిన ఆయన, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మీలు తనకు సోదరీమణుల్లాంటి వారని చెప్పారు.

అయితే తన తల్లిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని, దీనిపై హరీష్‌రావు సమాధానం చెప్పాలని సభలో ప్రశ్నించారు. మరోవైపు మంత్రి సీతక్క కూడా అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఘటనలపై తీవ్రంగా స్పందించారు. మహిళా పోలీసుల ముందు మహిళా ప్రజాప్రతినిధులు బట్టలు విప్పాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. స్పీకర్‌ను, ఆయన తల్లిని దూషించడం సమర్థనీయం కాదన్నారు. పోలీసులపై దాడి, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అదే సమయంలో మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు నిజంగా దాడి చేసి ఉంటే పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులైన పోలీసులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే డిక్లరేషన్ ఎందుకు ప్రకటించలేదని హరీష్‌రావు ప్రశ్నించగా, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేయకుండా తాళం ఎందుకు వేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.



## కల సాకారం.. డాక్టరేట్ కిరీటం

**ఏళ్ల కష్టానికి ప్రతిష్ఠాత్మక గుర్తింపు**

కల కన్నారు.. లక్ష్యంగా మార్చుకున్నారు.. ఏళ్ల తరబడి శ్రమించారు.. చివరకు ప్రతిష్ఠాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు డాక్టర్ లతా విశ్వజన్. ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ వార్షికోత్సవంలో డాక్టరేట్ పట్టా అందుకోవడం ఆమె విద్యా ప్రస్థానంలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచింది. ఎన్నో ఏళ్లుగా మనసులో పదిలంగా ఉన్న కల సాకారం కావడంతో ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ గౌరవం కేవలం ఓ విద్యా అర్హత కాదని, తన నిరంతర కృషికి లభించిన గుర్తింపు అని తెలిపారు. ఉస్మానియా వంటి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందడం తన జీవితంలో గర్వకారణమైన సందర్భమని చెప్పారు. తల్లిదండ్రులు, భర్త అందించిన అండ, ప్రోత్సాహమే తన విజయానికి ప్రధాన బలమని పేర్కొంటూ ఈ విజయాన్ని వారికి అంకితం చేశారు. లక్ష్యం ఎంత పెద్దదైనా కుటుంబ సభ్యుల సహకారం, ఆత్మవిశ్వాసం ఉంటే సాధించవచ్చని తన ప్రయాణం నిరూపించిందన్నారు.

**గురువుల ప్రోత్సాహమే విజయబలం**

డాక్టరేట్ సాధనలో ఎదురైన ఎన్నో సవాళ్లను పట్టుదలతో అధిగమించానని లతా విశ్వజన్ తెలిపారు. పరిశోధన సమయంలో ఎదురైన ఒత్తిళ్లు, క్లిష్ట పరిస్థితులను దాటుకుంటూ లక్ష్యం వైపు ముందుకు సాగినట్లు చెప్పారు. అధ్యాపకులు, పరిశోధనకు మార్గనిర్దేశం చేసిన గురువుల ప్రోత్సాహం తనకు ఎంతో బలాన్నిచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు. డాక్టరేట్ వెనుక తన ఒక్కరి కృషి మాత్రమే లేదని, కుటుంబం, గురువులు, మార్గదర్శకుల సహకారం ఉందని స్పష్టం చేశారు. చేతికి డాక్టరేట్ పట్టా అందుకున్న క్షణం ఏళ్ల కష్టాన్నంతా మరిపించే మధుర అనుభూతిని ఇచ్చిందన్నారు. తన విద్యా ప్రయాణం ద్వారా సాధారణ నేపథ్యాల నుంచి వచ్చే విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలన్నదే తన ఆకాంక్ష అని చెప్పారు. లక్ష్యాన్ని వదులుకోకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఎన్ని సవాళ్లనైనా అధిగమించి విజయం సాధించవచ్చని విద్యార్థులకు సందేశమిచ్చారు. ఈ డాక్టరేట్ తనకు కేవలం పట్టా కాదు.. కుటుంబ అండకు ప్రతిఫలం, గురువుల మార్గదర్శకత్వానికి గుర్తింపు, సంవత్సరాల పట్టుదలకు దక్కిన గౌరవమని లతా విశ్వజన్ పేర్కొన్నారు.

## ఎల్‌నినో వేడి.. పశువులకు జాగ్రత్త

ఎల్‌నినో పరిస్థితులతో ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పశువుల ఆరోగ్య పరిరక్షణకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్య నిపుణులు సూచించారు. ప్రొద్దుటూరులోని పశువైద్యశాలలో పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో పారా వెట్స్‌కు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వేడి ఒత్తిడి, నీటి కొరత, పశుగ్రాస సమస్యలను సమర్థంగా ఎదుర్కొనే విధానాలపై అవగాహన కల్పించారు. పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.ఆర్.కె. శర్మ, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా. వీం బ్రహ్మయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ డా. ధనుంజయరెడ్డి పాల్గొన్నారు. పశువులకు నిరంతరం స్వచ్ఛమైన నీరు, తగినంత నీడ, గాలి ప్రసరణ, సమతుల్య పోషణ అందేలా చూడాలని సూచించారు. డా. ఇందిర పశువుల యాజమాన్య పద్ధతులు, పశుగ్రాస నిర్వహణ, నీటి పొదుపు, వేడి ఒత్తిడి నివారణ చర్యలను వివరించారు. డా. రాజకిశోర్, డా. చరిత, డా. జాన్, డా. గాయత్రి, డా. వంశీ తదితరులు పశువుల ఆరోగ్యం, వ్యాధుల నివారణ, శాస్త్రీయ పశుపోషణపై శిక్షణ ఇచ్చారు. పశుగ్రాసాన్ని ముందుగానే నిల్వ చేసుకోవడంతో పాటు వేడి ఒత్తిడి లక్షణాలను గుర్తించిన వెంటనే వైద్య సేవలు అందించాలని పారా వెట్స్‌కు సూచించారు.



## కార్పొరేట్ సెలూన్లపై నాయిబ్రాహ్మణుల సమరం



ప్రొద్దుటూరులో స్థానిక నాయీ బ్రాహ్మణుల ఉపాధిని దెబ్బతీస్తున్న కార్పొరేట్ సెలూన్లకు వ్యతిరేకంగా నాయీ బ్రాహ్మణులు ఐక్యంగా పోరాడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం శేగిరెడ్డి కల్యాణ మండపంలో నాయీ బ్రాహ్మణులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సెలూన్ వ్యాపారులకు తమ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. స్థానికంగా వ్యాపారం చేస్తూ ప్రజలకు సేవలందిస్తున్న నాయీ బ్రాహ్మణులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'చేయూత' పథకం ద్వారా నాయీ బ్రాహ్మణులకు సుమారు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారని గుర్తుచేశారు. కులవృత్తిపై ఆధారపడిన వారికి 150 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని తెలిపారు. టీటీడీ పాలక మండలిలో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించడంతో పాటు వివిధ దేవాలయాల పాలక మండళ్లలో ప్రాతినిధ్యం ఇచ్చామని అన్నారు. ఉచిత ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో ప్రజలకు మేలు చేశామని పేర్కొన్నారు. తమను ప్రశ్నించిన నాయీ బ్రాహ్మణులపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సీఎం చంద్రబాబు నాయుడిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

## కాపీరైట్ పేరుతో కొత్త సైబర్ మోసం

కాపీరైట్ ఫిర్యాదుల పేరుతో ఇన్‌స్టాగ్రామ్ యూజర్లను బెదిరించి డబ్బులు దండుకునే కొత్త తరహా సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. ఇతరుల పోస్టులపై మోసగాళ్లు కావాలనే నకిలీ కాపీరైట్ ఫిర్యాదులు చేసి, వాటిని వెనక్కి తీసుకోవాలంటే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. వరుస ఫిర్యాదులతో ఖాతా బ్లాక్ అవుతుందనే భయంతో పలువురు క్రియేటర్లు డబ్బులు చెల్లిస్తున్నారు. 15 లక్షలకు పైగా ఫాలోవర్లున్న 'లాస్ట్ ఇన్ టైమ్ హిస్టరీ' పేజీ నిర్వాహకుడు ఓలి కూడా 50 డాలర్లు క్రిప్టో రూపంలో చెల్లించినా మళ్లీ కాపీరైట్ స్ట్రైక్స్ ఎదుర్కొన్నారు. దీంతో మానిటైజేషన్ నిలిచిపోయి ఆదాయం దెబ్బతింది. సాధారణ యూజర్ల ఫిర్యాదులపై మెటా స్పందన ఆలస్యమవుతోందని పలువురు క్రియేటర్లు ఆరోపిస్తున్నారు.

## మైనర్ గ్యాంగ్‌రేప్‌లో ఉరిశిక్ష

తిరునల్వేలి: మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ముగ్గురు నిందితుల్లో చిన్నకుట్టి (28)కి మరణశిక్ష విధించగా, మురుగేశన్ (23)కు 20 ఏళ్లు, మునీశ్వరన్ (25)కు 13 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేసింది. 2022లో 16 ఏళ్ల బాలికకు ప్రార్థనా స్థలంలో మునీశ్వరన్ పరిచయమయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను మీనాక్షిపురంలోని తన సోదరి ఇంటికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు ప్రాసిక్యూషన్ తెలిపింది. అనంతరం స్నేహితులైన చిన్నకుట్టి, మురుగేశన్‌ను అక్కడికి పిలిపించగా, వారు కూడా బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు పేర్కొంది. ఘటనను తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురినీ అరెస్ట్ చేసి దర్యాప్తు పూర్తి చేశారు. విచారణ అనంతరం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సురేశ్ కుమార్ మంగళవారం తుది తీర్పు ప్రకటించారు. నిందితుల్లో ఒకరికి ఉరిశిక్ష విధించడం రాష్ట్రంలో ఈ కేసును తీవ్రంగా చర్చనీయాంశంగా మార్చింది.

## డీఎస్సీ అక్రమాలపై వైసీపీ దూకుడు



అమరావతి: ఏపీ డీఎస్సీ నియామకాల్లో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. అక్రమాలకు బాధ్యత వహిస్తూ లోకేశ్ తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విజిలెన్స్ విచారణ జరుగుతోందని అధికారులు చెప్పడం అంటే అక్రమాలు జరిగినట్లు అంగీకరించడమేనని వ్యాఖ్యానించారు. కాలయాపన చేయకుండా ఈ వ్యవహారంపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరిపించి అసలు సూత్రధారులను బయటపెట్టాలని కోరారు. స్పోర్ట్స్ కోటాలో భర్తీ చేసిన 382 ఉద్యోగాల పూర్తి వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని డిమాండ్ చేశారు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. జూడో అసోసియేషన్ ఛైర్మన్‌గా ఉన్న లోకేశ్ తోడల్లుడు శ్రీభరత్‌పైనా ఆరోపణలు చేశారు. అసెంబ్లీని, ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించిన భరత్.. డీఎస్సీ అక్రమాలపై లోకేశ్‌తో ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

## యూకే ఎయిర్ ట్రాఫిక్ సిస్టమ్ డౌన్

**600కు పైగా విమానాలు రద్దు**




బ్రిటన్‌లోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక సమస్యతో విమాన రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. 600కుపైగా విమానాలు రద్దు కాగా, వందలాది విమానాలు ఆలస్యమయ్యాయి. బ్రిటన్ నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్ విమానాల ప్రాసెసింగ్ వ్యవస్థలో సమస్య గుర్తించినట్లు తెలిపింది. ఇంజినీర్లు అత్యవసరంగా రంగంలోకి దిగి సమస్యను పరిష్కరించే పనిలో నిమగ్నమయ్యారు. అనంతరం సాంకేతిక లోపానికి పరిష్కారం అమలు చేశామని, విమాన వ్యవస్థ క్రమంగా సాధారణ స్థితికి వస్తోందని చీఫూ ప్రకటించింది. లండన్‌లోని హీత్రో, స్టాన్‌స్టెడ్, సిటీ విమానాశ్రయాలతో పాటు మాంచెస్టర్, బర్మింగ్‌హామ్, స్కాట్లాండ్‌లోని పలు విమానాశ్రయాలపై ప్రభావం పడింది. బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఈజీజెట్, కేఎల్ఎం, లుఫ్తాన్సా సహా పలు విమానయాన సంస్థల సర్వీసులు దెబ్బతిన్నాయి.

**టార్మాక్‌పైనే గంటల తరబడి**

ఫ్లైట్ మానిటరింగ్ సంస్థ ఫ్లైట్‌రాడార్24 ప్రకారం వందలాది విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు 425 విమానాలు బ్రిటన్ విమానాశ్రయాలకు రావాల్సినవి లేదా అక్కడి నుంచి బయలుదేరాల్సినవి రద్దయ్యాయి. ఈజీజెట్ సైతం తమ కొన్ని విమా నాలు నడపలేకపోయామని ప్రకటించింది. వ్యవస్థ వైఫల్యంతో యూరప్ వ్యాప్తంగా విమానాలు ఆలస్యమైనట్లు తెలిపింది. కొందరు ప్రయాణికులు విమానాల్లో గంటల తరబడి టార్మాక్ పైనే చిక్కుకుపోయామని సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు. విమానయాన సంస్థల నుంచి సరైన సమాచారం అందలేదని పలువురు అసహనం వ్యక్తం చేశారు. హీత్రో విమానాశ్ర యంలో యూరప్ గమ్య స్థానాలకు వెళ్లే పలు స్వల్పదూర విమానాలు రద్దు లేదా ఆలస్య మైనట్లు వెబ్‌సై ట్‌లో కనిపించింది. అయితే వచ్చే విమానాలపై పెద్దగా ప్రభావం కనిపించ లేదు. సాంకేతిక సమస్యకు కారణం ఏమిటన్నది వెల్లడి కాలేదు.

## మాజీ ఢిల్లీ సీఎస్ రాకేశ్ ఆత్మహత్య

**నోయిడా ఫ్లాట్‌లో విషాదం**



ఢిల్లీ మాజీ ప్రధాన కార్యదర్శి రాకేశ్ మెహతా (74) ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందారు. నోయిడాలోని ఆయన నివాసంలో సెప్టెంబర్ 6న మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఘటనాస్థలంలో లభించిన నోట్‌లో ఆరోగ్యం, మానసిక సమస్యలను ప్రస్తావించినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. 1975 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి రాకేశ్ మెహతా ఢిల్లీ పాలనలో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. అప్పటి ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ హయాంలో ప్రభుత్వంలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా కూడా సేవలందించారు. పరిపాలనలో తనదైన ముద్ర వేసిన ఆయనకు ప్రభుత్వ వర్గాల్లో మంచి గుర్తింపు ఉంది.

**మూడు సంవత్సరాలకు పైగా సీఎస్‌గా**

రాకేశ్ మెహతా 2007లో ఢిల్లీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. మూడేళ్లకు పైగా ఆ పదవిలో కొనసాగారు. దేశ రాజధానిలో రవాణా, విద్యుత్, పౌర మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టుల అమలులో ఆయన ముఖ్య పాత్ర పోషించారు. ముఖ్యంగా 2010లో ఢిల్లీలో నిర్వహించిన కామన్వెల్త్ గేమ్స్ సమయంలో ఆయన సీఎస్‌గా ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం, భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల అమలులో ఆయన అనుభవం ఉపయోగపడిం ది. పోలీసులు ఘటనపై తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**కామన్వెల్త్ గేమ్స్ సీఎస్ ఇకలేరు**

1975 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన మెహతా.. మాజీ సీఎం షీలా దీక్షిత్ హయాంలో ఢిల్లీ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. నోయిడాలోని సెక్టార్ 82 నివాసంలో సెప్టెంబర్ 6న ఆయన మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో లభించినట్లు చెబుతున్న సూసైడ్ నోట్‌లో "మానసిక, ఆరోగ్య సమస్యలు" తన నిర్ణయానికి కారణాలుగా పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. సోమవారం లోధీ రోడ్ శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. 2007 నుంచి 2010 వరకు మూడేళ్లకు పైగా ఢిల్లీ సీఎస్‌గా పని చేశారు. 2010 కామన్వెల్త్ గేమ్స్ ఏర్పాట్లలో కీలక పాత్ర పోషించారు.

## బైపోల్స్‌లో డీఎంకే ఎంట్రీ

**తమిళనాడులో త్రిముఖ పోరు!... మూడు పార్టీల రసవత్తర పోటీ**



తమిళనాడులోని మదురాంతకం, ధారాపురం అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికలు ఆసక్తికరంగా మారుతున్నాయి. అధికార తమిళగ వెట్రి కళగం (టీవీకే)తో పాటు ఇప్పటికే ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమైన అన్నాడీఎంకేకు ఇప్పుడు డీఎంకే కూడా పోటీకి దిగాలని నిర్ణయించడం కీలక పరిణామంగా మారింది. దీంతో రెండు నియోజకవర్గాల్లో త్రిముఖ పోరు తప్పనిసరిగా కనిపిస్తోంది. సాధారణ ఎన్నికల తర్వాత జరుగుతున్న ఈ ఉప ఎన్నికలను ప్రధాన ప్రతిపక్ష పార్టీగా డీఎంకే ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది.

**జిల్లా కార్యదర్శులతో స్టాలిన్ మంతనాలు**

ఉప ఎన్నికల వ్యూహంపై చర్చించేందుకు డీఎంకే అధిష్ఠానం జిల్లా కార్యదర్శులను చెన్నైకి ఆహ్వానించింది. అభ్యర్థుల ఎంపిక, నియోజకవర్గాల పరిస్థితి, పార్టీ బలాబలాలు, ఎన్నికల ప్రచార వ్యూహంపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. మదురాంతకం, ధారాపురం స్థానాలు ఖాళీ కావడానికి ప్రధాన కారణం అక్కడి అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు రాజీనామా చేసి టీవీకేలో చేరడమే. దీంతో ఈ రెండు స్థానాల్లో జరిగే ఉప ఎన్నికలు తమిళనాడు రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అన్నాడీఎంకే ఇప్పటికే ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. డీఎంకే పోటీకి దిగడంతో టీవీకేకు వ్యతిరేకంగా అన్నాడీఎంకేతో రహస్య అవగాహన చేసుకుంటుందనే ప్రచారానికి తెరపడింది. డీఎంకే పోటీ నుంచి తప్పుకుంటే అన్నాడీఎంకేతో లోపాయికారీ ఒప్పందం ఉందనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతుందని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉప ఎన్నికల నుంచి దూరంగా ఉండటం సాధ్యం కాదని డీఎంకే భావిస్తోంది.




## తల్లీబిడ్డల ఆరోగ్యమే ప్రథమం

తల్లులు, చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరం అందేలా క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. యుగంధర్ సూచించారు. ప్రొద్దుటూరులోని ఎన్‌జీవో హోమ్ మీటింగ్ హాల్‌లో ఆశా డే, మాతా–శిశు ఆరోగ్యం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. కల్లూరు, కామనూరు, రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు పట్టణ పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఆశా కార్యకర్తల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించిన డా. యుగంధర్.. హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీ కిట్లను సక్రమంగా వినియోగించి తల్లీబిడ్డలకు అవసరమైన సేవలు అందించాలని సూచించారు. గర్భిణులు, శిశువులకు అందుతున్న వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, లక్ష్యాల సాధన, క్షేత్రస్థాయి సమస్యలు, రికార్డుల నిర్వహణపై సమగ్రంగా సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందేలా ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని ఆదేశించారు. పీహెచ్‌సీల పనితీరును బలోపేతం చేసి మాతా–శిశు ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అందించడమే లక్ష్యంగా పనిచేయాలని డీఎంహెచ్‌ఓ స్పష్టం చేశారు. సమావేశంలో డా. గీత, డా. ప్రవీణ కుమార్, డా.ఆరిఫ్, డా.తాహా, పలువురు వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## ఆన్‌లైన్ మట్కా గుట్టు రట్టు

ప్రొద్దుటూరులో ఆన్‌లైన్ మట్కా జూదానికి పాల్పడుతున్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నడింపల్లి ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్ బాషా ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ ఎస్ఐ మొయినుద్దీన్ ఆధ్వర్యంలో చేపట్టిన చర్యల్లో నిందితుడి వద్ద నుంచి రూ.7 వేల నగదు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆన్‌లైన్ వేదికగా మట్కా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిఘా పెట్టి నిందితుడిని పట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు సీఐ కొండారెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్ మట్కా, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. జూదాల బారిన పడి ఆర్థికంగా నష్టపోవద్దని ప్రజలకు సూచించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ మట్కా పేరుతో యువతను ఆకర్షించి డబ్బులు వసూలు చేసే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. తమ పరిసరాల్లో ఎవరైనా మట్కా నిర్వహిస్తున్నట్లు, జూదాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

# రీల్స్‌లో రియల్ హీరో ఎవరు..!? మీమ్స్‌లో మొనగాళ్లకు మొనగాడెవరు?

**• వైసీపీకి వైరల్ యుద్ధం.. టీడీపీది వ్యవస్థాగత సమరం • ఏపీలో సోషల్ మీడియా కురుక్షేత్రం.. ఎవరి చేతిలో ఏ అస్త్రం?**





**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అసెంబ్లీ, రోడ్లు, సభలు, మీడియా ఛానళ్లు మాత్రమే ఇప్పుడు యుద్ధరంగాలు కావు. అసలు రాజకీయ పోరాటం మరోచోట మరింత వేగంగా సాగుతోంది. అది సోషల్ మీడియా. 2026 ఆగస్టు–సెప్టెంబర్ నాటికి అధికార తెలుగుదేశం కూటమి, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ మధ్య పోరు పోస్టుల స్థాయిని దాటి ప్రత్యామ్నాయ రాజకీయ కథనాల పోటీగా మారింది. ఎవరు నిజం చెబుతున్నారు? ఎవరు అబద్ధం చెబుతున్నారు? ఎవరు ప్రజల్లోకి ముందుగా చేరుతున్నారు? ఎవరి కథనం ఎక్కువసేపు నిలుస్తోంది? అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. ఇందులో టీడీపీకి ఉన్న బలం సంస్థాగతమైనది. వైసీపీకి ఉన్న బలం వైరల్ సామర్థ్యం. అధికారంలో ఉన్న పార్టీకి ప్రభుత్వ కార్యక్రమాలను కంటెంట్‌గా మార్చే అవకాశం ఉంది. ప్రతిపక్షానికి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నగా మార్చే అవకాశం ఉంది. ఒకరు 'చూడండి మేం ఏం చేశామో' అంటుంటే.. మరొకరు 'చూడండి వాళ్లు ఏం చేయలేదో' అంటున్నారు. ఈ రెండు కథనాల మధ్యే ఏపీ డిజిటల్ రాజకీయాల అసలు కురుక్షేత్రం నడుస్తోంది.**

### • టీడీపీ డిజిటల్ దళానికి ఇదే అసలు బలం

టీడీపీ డిజిటల్ బలం కొత్తగా పుట్టింది కాదు. 2024 ఎన్నికలకు ముందు నుంచే పార్టీకి విస్తృతమైన సోషల్ మీడియా నెట్‌వర్క్ ఉందని అప్పటి పరిశీలనాత్మక నివేదికలు వెల్లడించాయి. సుమారు 1.48 లక్షల వాట్సాప్ గ్రూపులు, దాదాపు 500 ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ పేజీలు, 2.5 లక్షల వరకు మన టీడీపీ యాప్ యూజర్లు ఉన్నట్లు పార్టీ వర్గాలను ఉటంకిస్తూ నివేదికలు పేర్కొన్నాయి. పార్టీ అంశాలను విస్తరించడానికి డిజిటల్ కార్యకర్తలు, ఐటీడీపీ నెట్‌వర్క్, మీమ్ పేజీలు ఉపయోగపడుతున్నాయని కూడా ఆ నివేదికలు వివరిస్తున్నాయి. అంటే టీడీపీకి సోషల్ మీడియా అనేది ఎన్నికల సమయంలో మాత్రమే తెరిచే తలుపు కాదు. ఒకసారి నిర్మించుకున్న డిజిటల్ మౌలిక వ్యవస్థను అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొనసాగించే సామర్థ్యం ఉంది. ఇదే ఇప్పుడు వైసీపీతో పోటీలో దాని ప్రధాన బలం. ప్రభుత్వ పథకం వచ్చినా పోస్టు.. ముఖ్యమంత్రి కార్యక్రమం జరిగినా పోస్టు.. మంత్రి పర్యటన జరిగినా రీల్.. పార్టీ కార్యక్రమం జరిగినా లైవ్.. ప్రతిపక్షం ఆరోపణ చేసినా కౌంటర్. ఇలా కంటెంట్‌కు కొరత ఉండని పరిస్థితి అధికార పార్టీకి సహజంగానే ఏర్పడుతుంది. దానికి తోడు కేడర్ ఉంటుంది. ప్రభుత్వ యంత్రాంగం ద్వారా వచ్చే సమాచార ప్రవాహం ఉంటుంది. స్థానిక నాయకత్వం ఉంటుంది. ఇవన్నీ కలిస్తే సోషల్ మీడియా ఒక ప్రచార యంత్రంగా మారుతుంది. ఇటీవలి 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం కూడా ఈ వ్యూహంలో భాగంగానే చూడాలి. 42 రోజుల్లో 1.04 కోట్ల గడపలను తాకామని టీడీపీ ప్రచారం చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని కేవలం గ్రామాల్లో తిరిగిన రాజకీయ కార్యక్రమంగా కాకుండా డిజిటల్ కంటెంట్‌గా మలచడమే అసలు వ్యూహం. ఒక నాయకుడు ఒక ఇంటి ముందు నిలబడటం.. ఒక కుటుంబంతో మాట్లాడటం.. పథకాల గురించి వివరించడం.. పార్టీ జెండాలతో కార్యకర్తలు కనిపించడం.. ఇవన్నీ కలిపి రీల్ అవుతుంది. రీల్ షార్ట్ వీడియో అవుతుంది. షార్ట్ వీడియో వాట్సాప్‌లోకి వెళ్తుంది. అక్కడి నుంచి ఫేస్‌బుక్‌లోకి.. ఇన్‌స్టాగ్రామ్‌లోకి.. యూట్యూబ్‌లోకి వెళ్తుంది. అంటే ఒక గ్రామంలో జరిగిన కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్త రాజకీయ సందేశంగా మార్చే వ్యవస్థ టీడీపీకి ఉంది. ఇది 'పాజిటివ్ పొలిటికల్ మార్కెటింగ్'. ప్రభుత్వం చెప్పదలచుకున్నదాన్ని ముందుగానే ప్రజల మొబైల్ స్క్రీన్‌పైకి తీసుకెళ్లడం. అసలు ప్రభుత్వ పనితీరు ఎలా ఉన్నా, తన కథనాన్ని ప్రజల ముందుగా నిలబెట్టడం అధికార పార్టీకి అత్యంత కీలకం. ఎందుకంటే రాజకీయాల్లో మొదట వినిపించిన కథనం చాలాసార్లు ప్రజల మదిలో మొదటి అభిప్రాయంగా మిగిలిపోతుంది.

### • వైసీపీ సోషల్ మీడియా అస్త్రం.. డీఎస్సీ టార్గెట్

అయితే వైసీపీ వ్యూహం మరోలా కనిపిస్తోంది. అధికారంలో లేని పార్టీకి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేసుకునే అవకాశం ఉండదు. అందుకే ప్రభుత్వ నిర్ణయాలపై ప్రశ్నలు వేయడం, హామీల అమలును గుర్తుచేయడం, వివాదాస్పద అంశాలను పెద్దవిగా చేయడం, ప్రభుత్వంపై అనుమానం కలిగించే ప్రశ్నలను నిరంతరం తిప్పడం ప్రతిపక్షానికి సహజమైన వ్యూహం. 'సూపర్ సిక్స్' హామీలు, సంక్షేమ పథకాలు, నిరుద్యోగం, ధరలు, అప్పులు, ప్రభుత్వ నిర్ణయాలు వంటి అంశాలను వాట్సాప్ గ్రూపులు, మీమ్స్, షార్ట్ వీడియోలు, వాయిస్ నోట్ రూపంలో గ్రామస్థాయికి తీసుకెళ్లడం వైసీపీ డిజిటల్ వ్యూహంలో ప్రధాన భాగంగా కనిపిస్తోంది. ఇక్కడ వైసీపీకి మరో ప్రయోజనం ఉంది. ప్రభుత్వంపై ఉన్న ప్రతి అసంతృప్తి సహజంగానే ప్రతిపక్షానికి కంటెంట్ అవుతుంది. ఒక వ్యక్తికి పథకం రాలేదా? అది పోస్టు. ఒక విద్యార్థికి ఉద్యోగంపై అసంతృప్తి ఉందా? అది వీడియో. ఒక ఉద్యోగ అభ్యర్థి ప్రశ్నించాడా? అది రీల్. ఒక ప్రభుత్వ నిర్ణయంపై విమర్శ వచ్చిందా? అది మీమ్. అంటే ప్రతిపక్షానికి కంటెంట్ సృష్టించాల్సిన అవసరం తక్కువ. ప్రభుత్వ నిర్ణయాల నుంచే కంటెంట్ పుడుతుంది. ఈ పోరులో 'డీఎస్సీ' ఇప్పుడు కీలక మలుపు. ఆగస్టు నుంచే వైసీపీ డీఎస్సీ2025లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సీబీఐ విచారణను డిమాండ్ చేస్తోంది. నెల్లూరులో వేలాది మంది విద్యార్థులు, యువతతో ర్యాలీ నిర్వహించడం, కాకినాడలో బైక్ ర్యాలీ వంటి కార్యక్రమాలు కూడా ఇదే డిమాండ్ చుట్టూ జరిగాయి. సెప్టెంబర్ 6న వైసీపీ మరోసారి సీబీఐ విచారణ, మంత్రి నారా లోకేష్ రాజీనామాను డిమాండ్ చేసింది. పార్టీ నేత జక్కంపూడి రాజా డీఎస్సీ నియామకాల్లో అవకతవకలకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని ఆరోపించారు. ఇవన్నీ ఆరోపణలే తప్ప అవి నిర్ధారిత వాస్తవాలుగా చెప్పలేం. కానీ సోషల్ మీడియా రాజకీయాల్లో ఆరోపణ నిజమా కాదా అన్నదానికంటే అది ఎన్ని గంటలు ట్రెండ్ అయింది అన్నదే కొన్నిసార్లు ప్రధాన అంశంగా మారుతోంది.

### • రీచ్‌లో టీడీపీ.. చర్చలో వైసీపీ వైరల్

టీడీపీకి మరో బలం.. పాజిటివ్ కంటెంట్‌కు కొరత లేకపోవడం. వైసీపీకి మరో బలం.. ప్రతికూల అంశాలను రాజకీయ ప్రశ్నలుగా మలచడం. ఇదే ఇద్దరి మధ్య అసలు తేడా. టీడీపీ 'మేం చేశాం' అనే వీడియో పెడుతుంది. వైసీపీ 'మీరు ఎందుకు చేయలేదు?' అనే వీడియో పెడుతుంది. టీడీపీ ఇంటింటి కార్యక్రమాన్ని చూపిస్తుంది. వైసీపీ ప్రతి ఇంట్లో ఉన్న అసంతృప్తిని చూపించాలనుకుంటుంది. టీడీపీ సంక్షేమ పథకాలను లెక్కిస్తుంది. వైసీపీ అమలు కాని హామీలను లెక్కిస్తుంది. టీడీపీ బూత్ స్థాయి కార్యకర్తను కెమెరా ముందు నిలబెడుతుంది. వైసీపీ ప్రభుత్వంపై ప్రశ్నించే యువకుడిని కెమెరా ముందు నిలబెడుతుంది. రెండు పార్టీలూ వాస్తవానికి ఒకే పని చేస్తున్నాయి. ప్రజల మొబైల్‌లో తమ రాజకీయ ప్రతినిధిని కూర్చోబెట్టడం. అయితే 'ఎవరు గెలుస్తున్నారు?' అన్న ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పడం అంత సులభం కాదు. సంఖ్యల పరంగా, నెట్‌వర్క్ పరంగా టీడీపీ ముందంజలో ఉన్నట్టు కనిపిస్తోంది. పాత డిజిటల్ నెట్‌వర్క్‌కు తోడు అధికార వ్యవస్థ, విస్తృత కేడర్, ప్రభుత్వ కార్యక్రమాల నుంచి నిరంతరం వచ్చే కంటెంట్ కలుస్తున్నాయి. మరోవైపు వైసీపీకి సంస్థాగత డిజిటల్ మౌలిక వ్యవస్థ ఎంత విస్తృతంగా ఉందో తాజా, స్వతంత్రంగా ధృవీకరించిన గణాంకాలు అందుబాటులో లేవు. కానీ వైరల్ కంటెంట్‌ను సృష్టించడంలో ప్రతిపక్షానికి ఉన్న సహజమైన ప్రయోజనాన్ని తక్కువ అంచనా వేయలేం. ప్రభుత్వం చేసే ప్రతి తప్పు, ప్రతి ఆలస్యం, ప్రతి వివాదం ప్రతిపక్షానికి ఉచిత కంటెంట్. అందుకే 'రీచ్'లో టీడీపీ ముందున్నా, 'చర్చ'లో వైసీపీ ఒక్కోసారి గట్టిగా కనిపించవచ్చు.

### • వాట్సాప్‌లో కనిపించని యుద్ధమే కీలకం

ఇక్కడ మరో కీలకమైన అంశం వాట్సాప్. ఫేస్‌బుక్‌లో వైరల్ అయిన వీడియో ఎంత పెద్దదైనా అది అందరికీ కనిపించదు. కానీ వాట్సాప్‌లో ఒక స్థానిక గ్రూపులో పడిన మీమ్ ఒక నియోజకవర్గ రాజకీయాన్ని ప్రభావితం చేయగలదు. ఒక గ్రామంలోని రైతు గ్రూపులోకి వెళ్లిన వాయిస్ నోట్.. ఒక ఉద్యోగార్థుల గ్రూపులోకి వెళ్లిన డీఎస్సీ వీడియో.. ఒక మహిళా గ్రూపులోకి వెళ్లిన సంక్షేమ పథకం మీమ్.. ఇవే అసలు సూక్ష్మ రాజకీయ ఆయుధాలు. టీడీపీకి ఈ స్థాయిలో నెట్‌వర్క్ ఉన్నట్లు గతంలో నమోదైన గణాంకాలు చూపిస్తున్నాయి. వైసీపీ కూడా వాట్సాప్ ద్వారా ప్రభుత్వ వ్యతిరేక కథనాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ ఉంది. అంటే ఫేస్‌బుక్‌లో కనిపించే యుద్ధం కంటే వాట్సాప్‌లో కనిపించని యుద్ధమే ప్రమాదకరం. అక్కడ వైరల్‌కు లైక్ ఉండదు. షేర్ కౌంట్ కనిపించదు. కానీ ఒక కుటుంబం నుంచి మరో కుటుంబానికి సమాచారం వెళ్తుంది. ఒక గ్రూపు నుంచి మరో గ్రూపుకు వెళ్తుంది. అది చివరికి ఓటరు అభిప్రాయంగా మారుతుందా లేదా అన్నదే అసలు ప్రశ్న. ఇన్‌స్టాగ్రామ్, రీల్స్ మాత్రం మరో రకం యుద్ధభూమి. ఇక్కడ రాజకీయ సిద్ధాంతం కంటే దృశ్యం ముఖ్యం. 30 సెకన్ల వీడియోలో ఎవరు బలంగా కనిపించారు? ఎవరు ప్రజల మధ్య ఉన్నారు? ఎవరు కోపంగా మాట్లాడారు? ఎవరు నవ్వారు? ఎవరి వెనుక ఎక్కువ జనం కనిపించారు? ఇవే వైరల్ విలువను నిర్ణయిస్తాయి. టీడీపీ రోడ్‌షోలు, కేడర్ కార్యక్రమాలు, ఇంటింటి ప్రచార వీడియోలతో పాజిటివ్ విజువల్ నేరేటివ్‌ను నిర్మిస్తోంది. వైసీపీ మాత్రం బాధితులు, నిరుద్యోగులు, ప్రభుత్వంపై ప్రశ్నించే యువత, ధరలు-హామీలపై అసంతృప్తి వంటి అంశాలకు భావోద్వేగ దృశ్యరూపం ఇవ్వడానికి ప్రయత్నిస్తోంది. ఒకరు 'మాస్ మొమెంట్' అమ్ముతున్నారు. మరొకరు 'మాస్ డిస్కంటెంట్' అమ్ముతున్నారు.

### • యూట్యూబ్, ఎక్స్‌లో కథనాల యుద్ధం

యూట్యూబ్, ఎక్స్ మాత్రం మూడో రంగం. అక్కడ చిన్న వీడియో కన్నా వాదన ముఖ్యం. ఒక నాయకుడి ప్రెస్‌మీట్‌ను గంటసేపు చర్చించవచ్చు. ఒక ఆరోపణను పదిసార్లు కట్ చేసి చూపించవచ్చు. ఒక పార్టీ ప్రతినిధి చెప్పిన మాటకు ప్రత్యర్థి పార్టీ ప్రతినిధి గంటలో కౌంటర్ ఇవ్వవచ్చు. ముఖ్యంగా డీఎస్సీ వంటి అంశాలు ఇక్కడ రాజకీయ-మీడియా హైబ్రిడ్ కంటెంట్‌గా మారుతున్నాయి. ఒక ఆరోపణ.. దానికి కౌంటర్.. దానికి రిప్లై.. చివరకు టీవీ డిబేట్.. దాని క్లిప్ మళ్లీ సోషల్ మీడియాలోకి. ఇలా ఒక రాజకీయ వివాదం స్వయంగా తనకు తానే కంటెంట్‌ను ఉత్పత్తి చేసుకుంటోంది. అయితే సోషల్ మీడియా యుద్ధంలో అత్యంత ప్రమాదకరమైన విషయం 'ఎకో చాంబర్'. టీడీపీ అనుకూలురు తనకు నచ్చిన టీడీపీ కంటెంట్‌నే చూస్తారు. వైసీపీ అనుకూలురు తనకు నచ్చిన వైసీపీ కంటెంట్‌నే చూస్తారు. అల్గారిథమ్ కూడా అదే చేస్తుంది. ఫలితం ఇద్దరూ తమ పార్టీనే గెలుస్తోందని నమ్మే పరిస్థితి. సోషల్ మీడియా ట్రెండింగ్ అంటే ప్రజాభిప్రాయం అని భావించడం ఇక్కడే ప్రమాదకరం. వెయ్యి మంది గట్టిగా ట్వీట్ చేయడం అంటే కోటి మంది అదే అభిప్రాయంలో ఉన్నారని అర్థం కాదు. అదే విధంగా ఒక పార్టీకి వ్యతిరేకంగా పది వైరల్ వీడియోలు రావడం కూడా ఎన్నికల ఫలితం ముందే నిర్ణయించబడిందని చెప్పదు. 2029 ఎన్నికల దిశగా సాగుతున్న ఈ పోరులో సోషల్ మీడియా ప్రభావం పెరుగుతుంది కానీ అది ఒక్కటే ఓటును నిర్ణయించదు. గ్రౌండ్‌లోని అనుభవం, కుటుంబ చర్చలు, స్థానిక నాయకత్వం, అభ్యర్థి పనితీరు, ప్రభుత్వ సేవలు ఇవన్నీ చివరికి ఓటరుపై ప్రభావం చూపుతాయి.

### • కంటెంట్ కాదు.. విశ్వసనీయతే అసలు ఆయుధం

అందుకే టీడీపీకి ఇప్పుడు ఉన్న అసలు సవాలు 'ఎంత కంటెంట్ తయారు చేశాం?' కాదు. 'ఎంత విశ్వసనీయమైన కంటెంట్ తయారు చేశాం?' అన్నదే. వైసీపీకి కూడా అదే సవాలు. ప్రతీ ప్రభుత్వ నిర్ణయాన్ని స్కామ్‌గా, ప్రతీ చర్యను కుట్రగా, ప్రతీ విమర్శను నిర్బంధంగా చిత్రీకరిస్తే కొంతకాలానికి ప్రజలు ఆ కథనాన్ని కూడా అనుమానించడం మొదలుపెడతారు. అదే సమయంలో ప్రభుత్వం ప్రతీ విమర్శను ఫేక్ అని కొట్టిపారేస్తే అసలు ప్రశ్నలు కూడా ఫేక్‌ల జాబితాలో కలిసిపోయే ప్రమాదం ఉంది. డీఎస్సీ వివాదం అందుకు తాజా ఉదాహరణ. వైసీపీ ఆరోపణలు నిరూపించబడలేదు; అదే సమయంలో అవి రాజకీయంగా లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వాల్సిన అవసరం మాత్రం ఉంటుంది. ఆరోపణను 'ఫేక్' అనడం ఒక్కటే సమాధానం కాదు. డాక్యుమెంట్‌తో సమాధానం ఇవ్వాలి. ప్రక్రియతో సమాధానం ఇవ్వాలి. పారదర్శకతతో సమాధానం ఇవ్వాలి. ఇక వైసీపీకి కూడా ఒక రాజకీయ లెక్క ఉంది. అధికార పార్టీపై విమర్శించడం ప్రతిపక్షం హక్కు. కానీ సోషల్ మీడియా ట్రోలింగ్‌ను రాజకీయ ఉద్యమంగా భావించడం పొరపాటు. మీమ్ వైరల్ కావచ్చు. హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ కావచ్చు. వీడియోకు లక్షల వ్యూస్ రావచ్చు. కానీ చివరికి గ్రామంలో ప్రజలు ఏమనుకుంటున్నారు? ఉద్యోగార్థి ఏమనుకుంటున్నాడు? రైతు ఏమనుకుంటున్నాడు? మహిళా ఓటరు ఏమనుకుంటోంది? ప్రభుత్వ పథకం అందుతున్న కుటుంబం ఏమంటోంది? ఇవే అసలు ప్రశ్నలు. సోషల్ మీడియా ఆ ప్రశ్నలను ప్రతిబింబిస్తే రాజకీయ ఆయుధం. వాటిని కృత్రిమంగా సృష్టిస్తే కొంతకాలం తర్వాత అదే సోషల్ మీడియా తిరిగి దెబ్బతీయగలదు.

### • వైరల్ కాదు.. నమ్మకమే గెలుపు ఆయుధం

ఇక మొత్తంగా చూస్తే.. ఆగస్టు-సెప్టెంబర్ 2026లో ఏపీలో సోషల్ మీడియా యుద్ధానికి ఒక స్పష్టమైన రూపం వచ్చింది. టీడీపీ వ్యవస్థను నమ్ముకుంది. వైసీపీ కథనాన్ని నమ్ముకుంది. టీడీపీ రీచ్‌ను పెంచుతోంది. వైసీపీ రీచ్ కంటే ఇంపాక్ట్ కోసం చూస్తోంది. టీడీపీ ప్రభుత్వ కార్యక్రమాన్ని రాజకీయ విజయంగా మలుస్తోంది. వైసీపీ ప్రభుత్వ సమస్యను రాజకీయ వైఫల్యంగా మలచాలని చూస్తోంది. టీడీపీకి 'పాజిటివ్ డిఫెన్స్'. వైసీపీకి 'నెగెటివ్ అటాక్'. టీడీపీకి కేడర్ ఆధారిత డిజిటల్ మెషీన్. వైసీపీకి ప్రత్యర్థి ప్రభుత్వంపై అసంతృప్తిని సమీకరించే ప్రయత్నం. ఈ రెండు వ్యూహాలు 2029 దిశగా మరింత పదును పెరగడం ఖాయం. చివరికి ఎవరు గెలుస్తారు? సోషల్ మీడియాలో ఎవరు ఎక్కువ పోస్టులు పెట్టారో వారు కాదు. ఎవరి వీడియో ఎక్కువ వ్యూస్ తెచ్చుకుందో వారు కాదు. ఎవరి హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అయిందో వారు కాదు. తమ డిజిటల్ కథనాన్ని ప్రజల నిజ జీవిత అనుభవంతో ఎవరు కలపగలరో వారే గెలుస్తారు. టీడీపీకి అధికారంలో ఉన్న ప్రయోజనం ఉంది. వైసీపీకి ప్రతిపక్షంలో ఉన్న ప్రశ్నించే అవకాశం ఉంది. ఒకరి చేతిలో అధికార పనితీరు అనే కత్తి ఉంటే.. మరొకరి చేతిలో ప్రజా అసంతృప్తి అనే కవచం ఉంది. ఇప్పుడు రెండూ సోషల్ మీడియా మైదానంలో ఢీకొంటున్నాయి. రాబోయే రోజుల్లో ఈ పోరు పోస్టుల నుంచి పర్సనల్ ఫోన్లకు, ఫోన్ల నుంచి కుటుంబ చర్చలకు, కుటుంబ చర్చల నుంచి గ్రామాల రాజకీయానికి వెళ్లే కొద్దీ అసలు ఫలితం బయటపడుతుంది. అప్పటివరకు మాత్రం ఏపీలో రాజకీయ యుద్ధం సభల్లో కంటే స్క్రీన్లపైనే ఎక్కువ వేడిగా ఉండబోతోంది.

### • డీఎస్సీపై టీడీపీ కౌంటర్.. వైసీపీకి సెన్సార్ షాక్

ఇదే చోట టీడీపీ వ్యూహం మారింది. వైసీపీ డీఎస్సీని 'స్కామ్'గా ప్రచారం చేస్తుంటే.. టీడీపీ దాన్ని 'ఫేక్ ప్రచారం'గా తిప్పికొట్టే ప్రయత్నం చేస్తోంది. అంటే ఒకే అంశంపై రెండు పూర్తిగా విభిన్న కథనాలు. వైసీపీ చెబుతున్నది.. నియామకాల్లో అక్రమాలు జరిగాయి, విచారణ జరపాలి.' టీడీపీ చెబుతున్నది.. 'నియామకాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు, వాస్తవాలను చూడాలి.' ఈ రెండు కథనాల మధ్య సోషల్ మీడియా యుద్ధం సాగుతోంది. నారా లోకేష్ ఆధ్వర్యంలో అధికారుల వివరణలతో ప్రచారం చేయడం, 'డీఎస్సీ ఫేక్స్ బై వైఎస్సార్ సీపీ' వంటి హ్యాష్‌ట్యాగ్‌లతో కౌంటర్ ఇవ్వడం ఈ వ్యూహంలో భాగం. ఇక్కడ టీడీపీ ఒక విషయం అర్థం చేసుకుంది. ప్రతిపక్షం ఆరోపణను పట్టించుకోకుండా వదిలేస్తే అది కథనంగా బలపడుతుంది. వెంటనే కౌంటర్ ఇస్తే కనీసం రెండు కథనాలు సమాంతరంగా నడుస్తాయి. సోషల్ మీడియా యుద్ధంలో ఇదొక ప్రాథమిక వ్యూహం. కానీ ఈ డిజిటల్ యుద్ధానికి ఊహించని మలుపు ఇచ్చింది 'సెన్సార్‌షిప్' వివాదం. వైసీపీ అధికారిక ఫేస్‌బుక్ పేజీకి భారతదేశంలో యాక్సెస్ పరిమితం చేయబడిన విషయం వెలుగులోకి వచ్చింది. మెటా ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 79(3)(b) కింద ప్రభుత్వం లేదా లా ఎన్‌ఫోర్స్‌మెంట్ నుంచి వచ్చిన నోటీసు ఆధారంగా కంటెంట్‌కు భారతదేశంలో యాక్సెస్ పరిమితం చేసినట్లు పేర్కొన్నట్లు కోర్టు రికార్డుల్లో ఉంది. వైసీపీ దీనిపై కోర్టును ఆశ్రయించింది. ఆ నోటీసులో నిర్దిష్ట పోస్టు, వీడియో లేదా చిత్రాన్ని చూపలేదని, ఏ ప్రభుత్వ సంస్థ ఆదేశించిందో స్పష్టంగా తెలియజేయలేదని పార్టీ వాదించింది. ఇక్కడే వైసీపీకి కొత్త రాజకీయ ఆయుధం దొరికింది.. సెన్సార్‌షిప్'. ప్రభుత్వం తమ గొంతు నొక్కుతోందని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే పోస్టులను తొలగిస్తున్నారని వైసీపీ ఆరోపించింది. సెప్టెంబర్ 5న డీఎస్సీపై తాము పెట్టిన పోస్టులను తొలగించారని, సాహయోగ్ పోర్టల్ ద్వారా కంటెంట్ టేక్‌డౌన్ చేయిస్తున్నారని కూడా ఆరోపించింది. అధికార పక్షం మాత్రం సోషల్ మీడియా వేదికలను గతంలో ఫేక్ న్యూస్, ట్రోలింగ్, డీప్‌ఫేక్‌లకు ఉపయోగించారని ప్రత్యారోపణ చేస్తోంది. ఇక్కడ ఒక విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు సోషల్ మీడియాను విపరీతంగా ఉపయోగించిన రాజకీయ పార్టీనే ఇప్పుడు సోషల్ మీడియా నియంత్రణపై బాధితురాలిగా తనను తాను చూపించుకుంటోంది. మరోవైపు అధికారంలో ఉన్న పార్టీ 'చట్టపరమైన చర్య' అంటోంది. ప్రజాస్వామ్యంలో అసలు ప్రశ్న మాత్రం ఒక్కటే... ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ఎక్కడ ముగుస్తుంది? చట్టవిరుద్ధమైన కంటెంట్‌పై చర్య ఎక్కడ మొదలవుతుంది? ఈ గీత స్పష్టంగా కనిపించకపోతే సోషల్ మీడియా యుద్ధం రాజకీయ స్వేచ్ఛ.. ప్రభుత్వ నియంత్రణ మధ్య పెద్ద చర్చగా మారడం ఖాయం.








# పట్టాయా పాత ముద్ర.. కొత్త ముఖచిత్రం

పట్టాయా పేరు వినగానే ఒకప్పుడు గుర్తుకొచ్చేది రాత్రి జీవితం, బార్లు, గో-గో క్లబ్బులు, సెక్స్ టూరిజం. కానీ థాయ్‌లాండ్ సముద్రతీర నగరం ఇప్పుడు ఆ ఒక్క గుర్తింపుకే పరిమితం కావడం లేదు. కుటుంబాలతో వచ్చే పర్యాటకులు, ఆసియా దేశాల నుంచి తరలివచ్చే సందర్శకులు, విలాసవంతమైన రిసార్టుల్లో గడపాలనుకునే ప్రయాణికులతో పట్టాయా తన రూపాన్ని క్రమంగా మార్చుకుంటోంది. ఈ మార్పు మధ్య అమెరికా నౌకాదళానికి చెందిన యూఎస్‌ఎస్ అబ్రహాం లింకన్ రాక మరోసారి పట్టాయాను అంతర్జాతీయ వార్తల్లో నిలిపింది. సుమారు 5,000 మంది నావికులు, మెరైన్స్ ఉన్న లింకన్ నౌక సుదీర్ఘంగా సాగిన మధ్యప్రాచ్య విధుల అనంతరం విశ్రాంతి కోసం పట్టాయాకు చేరింది. క్యారియర్ స్ట్రైక్ గ్రూప్‌లోని ఇతర నౌకల సిబ్బంది కూడా ఈ ప్రాంతానికి వస్తున్నారు. సోషల్ మీడియాలో మాత్రం నావికుల రాకను పట్టాయా పాత రాత్రి జీవితంతో ముడిపెడుతూ సరదా వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. అయితే ఇటీవల పట్టాయాను సందర్శించినవారి అనుభవం మరో చిత్రాన్ని చూపిస్తోంది. కుటుంబాలకు అనుకూలమైన పార్కులు, షాపింగ్ మాల్స్, లగ్జరీ రిసార్టులు, వాటర్ పార్కులు, ప్రకృతి ఉద్యానవనాలు, గోల్ఫ్ కోర్సులు, సముద్ర విహారాలు నగరానికి కొత్త గుర్తింపును తీసుకొస్తున్నాయి. ఒకప్పుడు అమెరికన్ సైనికుల వినోద కేంద్రంగా పేరొందిన ఈ తీరనగరం ఇప్పుడు విభిన్న రకాల పర్యాటకులను ఆకర్షించే గమ్యస్థానంగా మారుతోంది. అయినప్పటికీ పాత పట్టాయా పూర్తిగా కనుమరుగైపోలేదు. నగరంలోని వాకింగ్ స్ట్రీట్ ఇప్పటికీ రాత్రి జీవితానికి కేంద్రంగా కొనసాగుతోంది. అందుకే పట్టాయా కథ ఒకే నగరానికి సంబంధించినది కాదు. సైనిక చరిత్ర, పర్యాటకం, ఆర్థిక అవసరాలు, సామాజిక మార్పులు, అంతర్జాతీయ ప్రయాణాల ప్రభావంతో రూపాంతరం చెందిన నగర కథ ఇది.

## లింకన్ రాకతో బిజినెస్ హంగామా




### • పాత చరిత్ర చెరిపేసి ప్రపంచం ముందుకు • పట్టాయా కొత్త ముఖచిత్రం

అమెరికా నౌకాదళానికి చెందిన భారీ యుద్ధనౌకల రాక పట్టాయాకు కొత్త విషయం కాదు. నగరానికి సమీపంలో ఉన్న లేమ్ చబాంగ్ పోర్టు, సత్తాహిప్ రాయల్ థాయ్ నేవీ బేస్ వంటి లోతైన నీటి నౌకాశ్రయాలు అమెరికా నౌకలకు కీలకమైన నిలయాలుగా ఉన్నాయి. ఇవి పట్టాయా నుంచి రహదారి మార్గంలో గంటలోపు దూరంలోనే ఉంటాయి. ఒకేసారి వందలాది, వేలాది మంది సైనికులు నగరంలోకి వచ్చినప్పుడు స్థానిక వ్యాపారాలకు నేరుగా ప్రయోజనం కలుగుతుంది. హోటళ్లు, రెస్టారెంట్లు, టాక్సీలు, షాపింగ్ కేంద్రాలు, పర్యాటక సేవలు, వినోద కేంద్రాలు సందడిగా మారుతాయి. సైనికుల షోర్ లీవ్ ఖర్చు స్థానిక ఆర్థిక వ్యవస్థలోకి నేరుగా ప్రవహిస్తుంది. అమెరికా నౌకాదళ సిబ్బంది పట్టాయాలో విశ్రాంతి తీసుకోవడం కేవలం వినోద ప్రయాణంగా చూడలేం. వారి రాక స్థానిక సేవా రంగానికి ఆదాయాన్ని అందిస్తుంది. అదే సమయంలో అమెరికా సైనిక మిషన్లలో సామాజిక సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందించడం, అనాథాశ్రమాల్లో సేవ చేయడం, స్థానిక సమాజాలతో కలిసి స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి చర్యలు కూడా జరుగుతాయి. భారీ నౌక సముద్రంలో నెలల తరబడి విధులు నిర్వర్తించిన తర్వాత సిబ్బందికి విశ్రాంతి అవసరం. ఆ అవసరానికి పట్టాయా ఒక అనుకూల కేంద్రంగా మారింది. 260 రోజులకు పైగా సముద్రంలో గడిపిన లింకన్ సిబ్బందికి పట్టాయా సందర్శన ప్రత్యేక విశ్రాంతి దశగా మారింది. అయితే వేలాది మంది విదేశీ సైనికులు ఒకేసారి నగరంలోకి రావడం వల్ల భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి అవసరం. అందుకే అమెరికా నౌకాదళ షోర్ పెట్రోల్ సభ్యులు థాయ్ పోలీసులతో కలిసి పనిచేస్తారు. ఏదైనా గొడవ తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటారు. నౌకాదళ సిబ్బందికి థాయ్ చట్టాలపై అవగాహన కల్పించడం కూడా ఇందులో భాగమే. వ్యభిచారం చట్టపరంగా నిషేధించబడినప్పటికీ ఆ నిబంధనలు ప్రతిసారీ కఠినంగా అమలవుతాయనే పరిస్థితి లేదు. అయితే అమెరికా సైనిక చట్టం ప్రకారం డబ్బు చెల్లించి లైంగిక సేవలు పొందడం శిక్షార్హమైన చర్య. అందువల్ల పట్టాయాలో స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉన్నప్పటికీ సైనిక సిబ్బందిపై నియమాలు స్పష్టంగానే ఉంటాయి.

**• వియత్నాం యుద్ధమే మలుపు**

పట్టాయా ప్రస్తుత రూపానికి పునాది ఎప్పుడు పడిందన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే వియత్నాం యుద్ధ కాలానికి వెళ్లాలి. ఆ సమయంలో థాయ్‌లాండ్‌లో సుమారు 40 వేల నుంచి 50 వేల మంది అమెరికా సైనిక సిబ్బంది ఉన్నారు. వియత్నాం యుద్ధానికి సంబంధించిన వైమానిక కార్యకలాపాలకు థాయ్‌లాండ్ కీలక స్థావరంగా మారింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో అమెరికా సైనిక స్థావరాలు ఏర్పడ్డాయి. వాటికి సమీపంలోని పట్టణాల్లో వినోద రంగం వేగంగా అభివృద్ధి చెందింది. పట్టాయా అప్పట్లో పెద్దగా పేరు లేని ప్రశాంతమైన మత్స్యకార గ్రామం. కానీ అమెరికా సైనికుల నిరంతర రాకతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. సైనికుల విశ్రాంతి కేంద్రంగా ప్రారంభమైన పట్టాయా క్రమంగా రాత్రి వినోదానికి ప్రసిద్ధి చెందిన సముద్రతీర నగరంగా మారింది. సత్తాహిప్ నౌకాదళ స్థావరం, ఉటపావో వైమానిక స్థావరం దగ్గరగా ఉండటం పట్టాయాకు మరింత ప్రయోజనం కలిగించింది. ఉటపావోలో అమెరికా వైమానిక దళానికి చెందిన బీ52 బాంబర్లు కూడా కార్యకలాపాలు నిర్వహించేవి. సైనిక స్థావరాల నుంచి వచ్చే సిబ్బందికి సమీపంలోనే సముద్రతీరం, హోటళ్లు, వినోద కేంద్రాలు ఉండటంతో పట్టాయా వేగంగా ఎదిగింది. 1960లో వ్యభిచారాన్ని నేరంగా పరిగణించే చట్టం అమల్లో ఉన్నప్పటికీ 1966లో వచ్చిన ఎంటర్‌టైన్‌మెంట్ ప్లేసెస్ చట్టం కారణంగా ఒక రకమైన చట్టపరమైన బూడిద ప్రాంతం ఏర్పడింది. బార్లు, మసాజ్ పార్లర్లలో లైంగిక సేవలు పరోక్షంగా కొనసాగేందుకు అవకాశం ఏర్పడింది. చట్టపరమైన నిషేధం ఒకవైపు.. ఆచరణలో పెరిగిన రాత్రి ఆర్థిక వ్యవస్థ మరోవైపు అనే విరుద్ధ పరిస్థితి పట్టాయా సామాజిక రూపాన్ని నిర్ణయించింది. 1976లో అమెరికా సైనిక బలగాలు థాయ్‌లాండ్ నుంచి వెనక్కి వెళ్లిన తర్వాత కూడా పట్టాయా అభివృద్ధి ఆగలేదు. బ్యాంకాక్‌కు సమీపంలోని సముద్రతీరం, ఇప్పటికే ఏర్పడిన హోటల్ వ్యవస్థ, బార్లు, వినోద కేంద్రాలు కొత్త అవకాశాన్ని సృష్టించాయి. తక్కువ ధరల విమాన ప్రయాణాలు అందుబాటులోకి రావడం, ప్యాకేజీ టూర్ల విస్తరణతో విదేశీ పర్యాటకులు పెద్ద సంఖ్యలో థాయ్‌లాండ్‌కు రావడం ప్రారంభించారు. సైనిక పర్యాటకంతో ఏర్పడిన మౌలిక వసతులను పౌర పర్యాటకం స్వీకరించింది. అదే సమయంలో థాయ్‌లాండ్‌లోని పేద ఈశాన్య ప్రాంతమైన ఇసాన్ నుంచి యువత పట్టాయాకు ఉపాధి కోసం రావడం పెరిగింది. గ్రామీణ వ్యవసాయ ఆదాయాలతో పోలిస్తే రాత్రి వినోద రంగంలో లభించే ఆదాయం ఎక్కువగా ఉండటంతో వారు కుటుంబాలకు డబ్బు పంపేవారు. ఇలా పట్టాయా ఆర్థిక వ్యవస్థకు సెక్స్ టూరిజం ఒక బలమైన భాగంగా మారింది.

**• రష్యన్ల రాకతో మరో రూపం**

పట్టాయా పరిణామంలో మరో కీలక మలుపు 1990లలో వచ్చింది. సోవియట్ యూనియన్ పతనం తర్వాత రష్యా నుంచి విదేశీ పర్యాటకుల రాక భారీగా పెరిగింది. నేరుగా చార్టర్ విమానాలు నడవడం, ప్రాంతీయ నగరాల నుంచి కూడా ప్రయాణ సౌకర్యాలు అందుబాటులోకి రావడం వల్ల పట్టాయా కొత్త పర్యాటక మార్కెట్‌ను అందుకుంది. ఉటపావో విమానాశ్రయం ఈ మార్పులో కీలక పాత్ర పోషించింది. 30 రోజుల వీసా రహిత ప్రయాణ సౌకర్యం రష్యన్ పర్యాటకుల రాకను మరింత సులభతరం చేసింది. పట్టాయా వీధుల్లో సిరిలిక్ అక్షరాలతో బోర్డులు కనిపించడం మొదలైంది. రష్యన్ పర్యాటకుల అవసరాలకు అనుగుణంగా రెస్టారెంట్లు, దుకాణాలు, పర్యాటక సేవలు మారాయి. ఒకప్పుడు ప్రధానంగా అమెరికన్ సైనికుల పేరుతో గుర్తింపు పొందిన పట్టాయా అంతర్జాతీయ పర్యాటక మార్కెట్‌లో మరో అడుగు ముందుకు వేసింది. అయితే విదేశీయుల రాకతో కొన్ని సమస్యలు కూడా పెరిగాయి. అనుకూల వాతావరణం, చట్ట అమలులో ఉన్న సడలింపులపై ఏర్పడిన అభిప్రాయం కారణంగా వివిధ దేశాలకు చెందిన నేరస్థులు, పరారీలో ఉన్న వ్యక్తులు కూడా పట్టాయాను ఆశ్రయించిన సందర్భాలు ఉన్నాయి. రష్యా, తూర్పు యూరప్, పశ్చిమ యూరప్‌కు చెందిన నేరగాళ్లతో పాటు ఆస్ట్రేలియాకు చెందిన మాదకద్రవ్యాల ముఠాలు కూడా నగరంతో సంబంధాలు ఏర్పరచుకున్నాయి. దీంతో పట్టాయా పేరు కేవలం వినోద నగరంగా కాకుండా అంతర్జాతీయ నేర కార్యకలాపాల చర్చల్లో కూడా వినిపించింది. అయితే పర్యాటక రంగం విస్తరించడంతో నగర ఆర్థిక నిర్మాణం కూడా మారింది. రాత్రి జీవితంతో పాటు హోటళ్లు, రెస్టారెంట్లు, షాపింగ్, సముద్ర పర్యాటకం, రిసార్టులు, వినోద పార్కులు విస్తరించాయి. థాయ్ దేశీయ పర్యాటకులు కూడా పట్టాయాకు పెద్ద సంఖ్యలో రావడం ప్రారంభించారు. ఆసియా దేశాల నుంచి వచ్చే పర్యాటకులు నగరానికి మరో కొత్త మార్కెట్‌గా మారారు. ఫలితంగా పట్టాయా ఒకే రకమైన పర్యాటకుడిపై ఆధారపడే నగరం కాకుండా బహుళ పర్యాటక మార్కెట్లను కలుపుకున్న అంతర్జాతీయ గమ్యస్థానంగా రూపాంతరం చెందింది. పాత రాత్రి జీవితానికి సంబంధించిన గుర్తింపు మాత్రం పూర్తిగా తొలగిపోలేదు. అదే పట్టాయా బ్రాండ్‌లో ఒక భాగంగా మిగిలిపోయింది. నగర చరిత్రను అర్థం చేసుకోవాలంటే ఈ రెండు ముఖాలను కలిపి చూడాల్సిందే.






**• కుటుంబ పర్యాటకమే కొత్త లక్ష్యం**

గతంలో ఏర్పడిన వివాదాస్పద గుర్తింపును మార్చుకోవడానికి పట్టాయా కొన్నేళ్లుగా ప్రత్యేకంగా ప్రయత్నిస్తోంది. కుటుంబ పర్యాటక కేంద్రంగా పట్టాయాను మళ్లీ బ్రాండ్ చేసుకోవడం నగర పాలకులు, వ్యాపార వర్గాలు, పర్యాటక రంగం ముందుంచుకున్న ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా మారింది. దాని ఫలితాలు ఇప్పుడు నగర రూపంలో కనిపిస్తున్నాయి. కుటుంబాలతో వచ్చే సందర్శకులను ఆకర్షించే వాటర్ పార్కులు, షాపింగ్ మాల్స్, విలాసవంతమైన రిసార్టులు, ప్రకృతి ఉద్యానవనాలు పెద్ద సంఖ్యలో ఏర్పడ్డాయి. కార్టూన్ నెట్‌వర్క్ కార్యక్రమాల ఆధారంగా రూపొందించిన ప్రముఖ వాటర్ పార్క్ పిల్లలు, కుటుంబాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. నాంగ్ నూచ్ ట్రాపికల్ బొటానికల్ గార్డెన్ విస్తారమైన మొక్కలు, పూలతో సందర్శకులను ఆకట్టుకుంటోంది. అక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. శాంక్చువరీ ఆఫ్ ట్రూత్ పూర్తిగా చెక్కతో నిర్మించిన భారీ నిర్మాణంగా పర్యాటకులకు ప్రత్యేక అనుభూతిని ఇస్తోంది. వంద మీటర్లకు పైగా ఎత్తైన ఈ నిర్మాణం పట్టాయా పర్యాటక చిత్రంలో కొత్త కోణాన్ని చూపిస్తోంది. గోల్ఫ్ కోర్సులు, రన్నింగ్ ఈవెంట్లు, సమీప ద్వీపాలకు డే ట్రిప్పులు కూడా నగరానికి వచ్చే సందర్శకుల సంఖ్యను పెంచుతున్నాయి. నగర చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏర్పడిన లగ్జరీ రిసార్టులు పట్టాయాను ఎక్కువ కాలం ఉండే పర్యాటకులకు అనుకూలంగా మార్చుతున్నాయి. పాత పట్టాయా రాత్రి జీవితంతో గుర్తింపు పొందితే.. కొత్త పట్టాయా కుటుంబ వినోదం, ప్రకృతి, విలాసవంతమైన పర్యాటకం, సముద్ర అనుభవాలతో తనను తాను నిర్వచించుకుంటోంది. అయినప్పటికీ పాత గుర్తింపును పూర్తిగా తుడిచేయడం సాధ్యం కాలేదు. రాత్రి వేళల్లో వాకింగ్ స్ట్రీట్ ఇప్పటికీ సందడిగా ఉంటుంది. నగరంలోని రేసీ నైట్‌లైఫ్‌ను ప్రత్యక్షంగా చూడాలనుకునే పర్యాటకులకు అది ప్రధాన ఆకర్షణగానే ఉంది. అందువల్ల పట్టాయా ఒకేసారి రెండు ప్రపంచాలను మోస్తోంది. ఒక వైపు కుటుంబాలతో వచ్చే పర్యాటకులు, పిల్లల కోసం వినోద కేంద్రాలు, ప్రకృతి ఉద్యానవనాలు, మరోవైపు దశాబ్దాలుగా కొనసాగుతున్న రాత్రి వినోద సంస్కృతి. ఈ ద్వంద్వ రూపమే పట్టాయాను ఇతర సముద్రతీర నగరాల నుంచి ప్రత్యేకంగా నిలబెడుతోంది.




### • సైనిక చరిత్ర నుంచి ప్రపంచ పర్యాటకానికి

'అబ్రహాం లింకన్ నౌక రాకతో మరోసారి పట్టాయా పేరు ప్రపంచ వార్తల్లోకి రావడం వెనుక ఈ మొత్తం చరిత్ర దాగి ఉంది. నేటి పట్టాయాను కేవలం సెక్స్ టూరిజం నగరంగా చెప్పడం ఎంత అసంపూర్ణమో, దాని గతాన్ని పూర్తిగా మర్చిపోయి కుటుంబ పర్యాటక కేంద్రంగా మాత్రమే చూడటం కూడా అంతే అసంపూర్ణం. సైనిక అవసరాలు పట్టాయాకు మొదటి అంతర్జాతీయ సందర్శకులను తీసుకొచ్చాయి. పర్యాటక రంగం ఆ అవకాశాన్ని విస్తరించింది. చౌక విమాన ప్రయాణాలు నగరాన్ని ప్రపంచ పర్యాటక మార్కెట్‌తో అనుసంధానించాయి. రష్యన్ పర్యాటకుల రాక మరో మార్పుకు కారణమైంది. ఇప్పుడు కుటుంబ పర్యాటకం పట్టాయాకు కొత్త దిశను చూపిస్తోంది. ఒకప్పుడు మత్స్యకార గ్రామంగా ఉన్న ప్రాంతం కొన్ని దశాబ్దాల్లో ప్రపంచానికి తెలిసిన సముద్రతీర గమ్యస్థానంగా మారడం వెనుక ఇదే పరిణామ క్రమం ఉంది. అమెరికా సైనికుల రాకతో ఏర్పడిన వినోద మౌలిక వసతులు తరువాత పౌర పర్యాటకానికి ఉపయోగపడ్డాయి. ఆర్థిక అసమానతల కారణంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన యువత పట్టాయా సేవా రంగానికి కార్మిక శక్తిని అందించింది. అంతర్జాతీయ పర్యాటకుల పెరుగుదల నగర వ్యాపారాలను విస్తరించింది. అదే సమయంలో నేర కార్యకలాపాలు, వ్యభిచారం, మాదకద్రవ్యాల ఆరోపణలు నగర ప్రతిష్ఠపై ప్రతికూల ముద్ర వేశాయి. ఇప్పుడు ఆ ముద్రను తగ్గించేందుకు పట్టాయా కొత్త పెట్టుబడులు, కుటుంబ వినోద కేంద్రాలు, రిసార్టులు, ప్రకృతి పర్యాటకం, సాంస్కృతిక ఆకర్షణలపై దృష్టి పెడుతోంది. లింకన్ సిబ్బంది వీధుల్లో కనిపించడం ఈ మార్పుకు విరుద్ధంగా కనిపించినా, వాస్తవానికి పట్టాయా చరిత్రలో సైనిక సంబంధం ఇప్పటికీ కొనసాగుతోందనే విషయాన్ని గుర్తు చేస్తోంది. ఒకప్పుడు అమెరికన్ సైనికుల విశ్రాంతి కేంద్రంగా ఎదిగిన పట్టాయా.. ఇప్పుడు ప్రపంచ పర్యాటకులను ఆహ్వానించే నగరంగా తన భవిష్యత్తును నిర్మించుకుంటోంది. పాత వాకింగ్ స్ట్రీట్ ఇంకా అక్కడే ఉంది. కొత్త వాటర్ పార్కులు కూడా అక్కడే ఉన్నాయి. పాత బార్లతో పాటు కొత్త లగ్జరీ రిసార్టులు కూడా ఉన్నాయి. సైనిక చరిత్రతో పాటు కుటుంబ పర్యాటక భవిష్యత్తు కూడా ఉంది. అందుకే పట్టాయా కథను ఒకే కోణంలో చెప్పలేం. ఇది కాలంతో పాటు తన గుర్తింపును మార్చుకుంటూ వచ్చిన నగరం. పాత ముద్రను పూర్తిగా చెరపకుండానే కొత్త ముఖచిత్రాన్ని ప్రపంచానికి చూపిస్తున్న నగరం. అబ్రహాం లింకన్ సిబ్బంది తాజా సందర్శన ఆ రెండు ముఖాలను మరోసారి ఒకే ఫ్రేమ్‌లోకి తీసుకొచ్చింది.

పంజాబ్‌లో కాంగ్రెస్

# ఐక్యతకు పైలట్ ప్లాన్

- రాహుల్–ఖర్గే నాయకత్వంలో వ్యూహాలు



పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ను గద్దె దించి తిరిగి అధికారంలోకి రావడమే కాంగ్రెస్ లక్ష్యంగా కనిపిస్తోంది. ఆ పార్టీ కొత్తగా పంజాబ్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన సచిన్ పైలట్, రాష్ట్రంలోని దాదాపు అన్ని ముఖ్య నేతలతో మాట్లాడినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో సమష్టిగా పనిచేస్తామని నేతలు హామీ ఇచ్చారని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ మధ్య విభేదాలపై పైలట్ భిన్నంగా స్పందించారు. వారిని 'వర్గాలుగా' చూడటం కంటే ఒకే రాజకీయ లక్ష్యాన్ని వివిధ విధాలుగా చూస్తున్న నేతలుగా పేర్కొన్నారు. పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య, వ్యవసాయ సంక్షోభం, ఆర్థిక పరిస్థితి కాంగ్రెస్‌కు ప్రధాన సవాళ్లుగా ఉన్నాయని చెప్పారు.

### చన్నీ నుంచి పూర్తి మద్దతు హామీ

చన్నీకి పీసీసీ అధ్యక్ష పదవి దక్కకపోవడం, సీఎం అభ్యర్థిగా ప్రకటించకపోవడంపై అసంతృప్తి ఉందన్న ప్రచారం నేపథ్యంలో పైలట్ ఆయనతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. చన్నీతో తన సమావేశం ఎంతో స్నేహపూర్వకంగా సాగిందని, ఇకపై పార్టీ కార్యక్రమాలకు పూర్తి మద్దతు ఇస్తానని ఆయన హామీ ఇచ్చారని పైలట్ వెల్లడించారు. చన్నీకి గతంలో కాంగ్రెస్ సీఎం పదవి ఇచ్చిందని, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోనూ అవకాశం కల్పించిందని గుర్తుచేశారు. ఎన్నికలు బహుముఖ పోరుగా మారే అవకాశం ఉన్నా ప్రధాన పోటీ కాంగ్రెస్, ఆప్ మధ్యే ఉంటుందని పైలట్ అభిప్రాయపడ్డారు. బీజేపీ-శిరోమణి అకాలీదళ్ పొత్తు కుదుర్చుకున్నా అది తమ వ్యూహాన్ని ప్రభావితం చేయదని స్పష్టం చేశారు. ఆప్ అధికారంలో ఉన్నందున ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందేనని అన్నారు.

### పంజాబ్‌కు కొత్త ఆర్థిక దిశ

పంజాబ్ ప్రజలు ఇప్పుడు కొత్త ఆరంభం, పూర్తి మార్పు కోరుకుంటున్నారని పైలట్ చెప్పారు. పరిశ్రమలు, వ్యవసాయం, ఉపాధి, కొత్త సాంకేతికత, పెట్టుబడుల విషయంలో రాష్ట్రం తన సామర్థ్యానికి తగ్గ స్థాయికి చేరలేదని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా పంజాబీలు పరిశ్రమలు, టెక్నాలజీ, బ్యాంకింగ్ సహా అనేక రంగాల్లో ముందున్నా, స్వరాష్ట్రానికి తిరిగి వచ్చి పెట్టుబడులు పెట్టే పరిస్థితులు అనుకూలంగా లేవని పేర్కొన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రాక్టికల్, భవిష్యత్ దృష్టితో కూడిన సమగ్ర ఆర్థిక బ్లూప్రింట్ రూపొందించాలని భావిస్తోంది. తీవ్రవాద భావజాలానికి మళ్లీ ఆదరణ పెరగడం ప్రమాదకరమని హెచ్చరించిన పైలట్, పంజాబ్ లౌకిక విలువలను కాపాడాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఇదిలా ఉంటే, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రచారానికి రాహుల్ గాంధీ బస్ యాత్ర చేపట్టాలని నేతలు కోరారు. యాత్ర రూపకల్పన, తేదీలు, గమ్యస్థానాలపై త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# యాప్స్‌పై ఏఐ పట్టు.. మెటా సంచలనం

### ఇకపై ఇమెయిల్స్, చెల్లింపులు కూడా!



మెటా తన కొత్త ఏఐ ఏజెంట్ మ్యూజ్‌ను విడుదల చేసింది. ఈ ఏఐ వినియోగదారుల తరఫున పలు పనులను స్వయంగా నిర్వహించగలదని కంపెనీ తెలిపింది. ఇమెయిల్స్ పంపడం, కారును విక్రయించడం, ప్రయాణాలను బుక్ చేయడం, చెల్లింపులు చేయడం వంటి పనులను యూజర్ సూచనల మేరకు పూర్తి చేయగలదు. అంతర్గతంగా 'హ్యాచ్'గా పిలిచిన ఈ ఏజెంట్.. మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ప్రతిపాదిస్తున్న 'పర్సనల్ సూపర్ ఇంటెలిజెన్స్' ప్రణాళికలో కీలక భాగంగా మారింది. తొలుత ఈ సేవ అమెరికాలో మాత్రమే అందుబాటులో ఉంటుంది. ప్రత్యేక మ్యూజ్ యాప్‌తో పాటు వాట్సాప్ ద్వారా కూడా దీనిని ఉపయోగించుకోవచ్చు. త్వరలో మెటా స్మార్ట్ గ్లాసెస్‌లోనూ ఈ ఏజెంట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ వెల్లడించింది.

### వ్యక్తిగత డేటాపై ఏఐకి యాక్సెస్

ఓపెన్‌సోర్స్ ఏఐ ఏజెంట్ ఓపెన్‌క్లా మాదిరిగా రూపొందించిన మ్యూజ్‌కు ఈమెయిల్, క్యాలెండర్, పేమెంట్స్, ఆరోగ్యం, షాపింగ్, స్మార్ట్ హోమ్ వంటి యాప్స్‌కు యాక్సెస్ ఇవ్వవచ్చు. ఏ యాప్స్‌కు అనుమతి ఇవ్వాలో వినియోగదారులే నిర్ణయిస్తారు. అవసరమైతే ఆ అనుమతిని ఎప్పుడైనా వెనక్కి తీసుకోవచ్చు. ప్రతి మ్యూజ్ ఏజెంట్ కోసం ప్రత్యేక వర్చువల్ మెషీన్ ఏర్పాటు చేస్తారు. దీంతో యూజర్ యాక్టివ్‌గా లేకపోయినా ఏజెంట్ బ్యాక్‌గ్రౌండ్‌లో పనులను కొనసాగించగలదు. అయితే వ్యక్తిగత డేటా ఉన్న యాప్స్‌కు నేరుగా యాక్సెస్ ఇవ్వడం వల్ల భద్రత, గోప్యత, తప్పిదాల ప్రమాదం మరింత పెరుగుతోంది. భద్రతా ప్రమాణాలు చేరే వరకు ఏప్రిల్‌లో విడుదలను వాయిదా వేసినట్లు మెటా ఏఐ ప్రొడక్ట్స్ వైస్ ప్రెసిడెంట్ విశాల్ షా తెలిపారు.

### అంతర్గత పరీక్షల్లో బయటపడ్డ లోపాలు

మ్యూజ్ విడుదలకు ముందు మెటా ఉద్యోగులు నిర్వహించిన అంతర్గత పరీక్షల్లో మాత్రం ఆందోళన కలిగించే సమస్యలు బయటపడ్డాయి. కొందరికి ప్రయాణ ప్రణాళికలు, రవాణా ఏర్పాట్లలో ఏజెంట్ అద్భుతంగా పనిచేసినా.. మరికొన్ని సందర్భాల్లో ఎలాంటి వివరణ లేకుండా పని ఆపేసినట్లు ఉద్యోగులు తెలిపారు. త్వరగా అమ్ముడయ్యే టికెట్లను పర్యవేక్షించమని ఇచ్చిన ఆదేశాలను కొంతసేపటి తర్వాత ఏజెంట్ నిలిపివేసిన ఘటనలు కూడా నమోదయ్యాయి. మెటా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఆండ్రూ బోస్వర్త్ సైతం తరచూ లాగ్‌అవుట్ అవుతున్న సమస్యను ప్రస్తావించారు. మరింత తీవ్రమైన ఘటనలో భద్రతా పరిమితులను దాటి వ్యక్తిగత ఐక్లౌడ్ ఫోటోలను బయటకు తీసే ప్రయత్నం జరిగినట్లు ఉద్యోగులు గుర్తించారు. ఈ నేపథ్యంలో మ్యూజ్ ఏఐ సేవలు ఎంత ఉపయోగకరంగా ఉన్నా, వ్యక్తిగత సమాచారంతో పనిచేసే ఏఐ ఏజెంట్లలో విశ్వసనీయత, గోప్యత, భద్రతే అతిపెద్ద సవాళ్లుగా మారనున్నాయి.

# డాన్స్ ఫ్లోర్ నుంచి యుద్ధభూమికి రోబోలు

- చైనా సైన్యంలో హ్యూమనాయిడ్లకు చోటు



చైనాలో ఇటీవల జరిగిన వరల్డ్ హ్యూమనాయిడ్ రోబోట్ గేమ్స్‌లో రోబోలు పరుగులు, బాక్సింగ్, డ్యాన్స్‌తో ఆకట్టుకున్నాయి. కొన్ని రోబోలు 100 మీటర్ల పరుగులో ఉసేన్ బోల్ట్ రికార్డును మించిన వేగాన్ని కూడా ప్రదర్శించాయి. అయితే పోటీలు ముగిసిన వెంటనే చైనా సైన్యం వీటి సామర్థ్యాలను మరో కోణంలో పరిశీలించింది. యుద్ధభూమిలో హ్యూమనాయిడ్ రోబోలను ఉపయోగించే దిశగా పరిశోధన వేగం పెంచాలని పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అధికారిక పత్రిక పిలుపునిచ్చింది. రాయిటర్స్ పరిశీలించిన వందకు పైగా సైనిక కొనుగోలు నోటీసులు, పరిశోధనా పత్రాలు, పేటెంట్లు, అధికారిక రికార్డుల ప్రకారం 2025, 2026లో చైనా సైనిక సంస్థలు హ్యూమనాయిడ్ల సైనిక వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాయి.

### గూఢచర్యం నుంచి దాడుల వరకు

చైనా సైనిక పరిశోధకులు రోబోలను సైనికులతో కలిసి పనిచేయించడం, శత్రు ప్రాంతాల్లోకి చొరబాటు, భవనాల తనిఖీ, నిఘా, ప్రమాదకర ప్రాంతాల్లో కార్యకలాపాలు వంటి విధుల్లో ఉపయోగించే అవకాశాలను అధ్యయనం చేస్తున్నారు. 2025లో నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీ పరిశోధకులు రూపొందించిన ఒక అధ్యయనంలో ఆరు 'కాంబాట్ రోబోలు' రెండు దాడి బృందాలతో కలిసి శత్రువు ఆధీనంలోని భవనాలను అంతస్తుల వారీగా, గదుల వారీగా స్వాధీనం చేసుకునే పరిస్థితిని నమూనాగా చూపించారు. హ్యూమనాయిడ్లలో రెండు కాళ్లు, రెండు చేతులు ఉండటం వల్ల మెట్లు, భవనాలు, సొరంగాలు, నౌకల లోపలి ప్రాంతాల్లో పనిచేసే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఇవి అధిక శక్తి వినియోగం, పరిమిత సామర్థ్యం, అనూహ్య పరిస్థితుల్లో పని చేయలేకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయి. సాధారణ నిఘా, సరఫరా పనులకు రోబో డాగ్స్, చక్రాల రోబోలు మరింత చౌకగా ఉండొచ్చని నిపుణుల అభిప్రాయం.






# లండన్ కల మాటున భారీ చీటింగ్ కుట్ర

## యూకే ఉద్యోగాల పేరుతో మోసాల వల

### జాబ్స్ పేరుతో చీటింగ్ నెట్‌వర్క్ యూట్యూబర్ చుట్టూ కోట్ల చీటింగ్ దందా

### సోషల్ మీడియాలో వచ్చిన ఫాలోయింగ్..

లండన్ ఉద్యోగాల పేరుతో పెరిగిన పరిచయాలు.. విదేశాల్లో స్థిరపడాలన్న యువత ఆశలు.. చివరకు రూ.15 కోట్ల మోసం ఆరోపణల దాకా వెళ్లిన వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారింది. 'నందూస్ వరల్డ్' పేరుతో సోషల్ మీడియాలో గుర్తింపు పొందిన తెలుగు యూట్యూబర్ అన్నె రామ నందనను హైదరాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆర్జీఐఏ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యూకేలో ఉద్యోగాలు, వీసా స్పాన్సర్‌షిప్‌లు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. ఆమెపై లుక్‌అవుట్ సర్క్యులర్ ఉండటంతో విమానాశ్రయంలో పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతరం ఆమెను ఎన్‌టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించే ప్రక్రియ చేపట్టారు. ఈ కేసులో నందనతో పాటు ఆమె భర్త జగర్లమూడి మధుకర్ పేర్లు కూడా ఉన్నాయి. విజయవాడ, గుంటూరు, హైదరాబాద్‌లో 'డెస్టినీ కన్సల్టెన్సీ' పేరుతో కార్యాలయాలు నిర్వహిస్తూ ఒక్కొక్కరి నుంచి రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వసూలు చేసినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఇప్పటివరకు అందిన ఫిర్యాదుల ఆధారంగా సుమారు రూ.15 కోట్ల మేర వసూళ్లు జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే బాధితుల అసలు సంఖ్య, వసూలైన మొత్తం, మొత్తం వ్యవహారంలో ఎవరి పాత్ర ఎంత అన్నది దర్యాప్తు పూర్తయ్యే వరకు స్పష్టంగా తేలాల్సి ఉంది. విదేశాల్లో ఉద్యోగం.. మంచి జీతం.. అక్కడే స్థిరపడాలన్న కలను లక్ష్యంగా చేసుకుని ఈ వ్యవహారం సాగిందన్నది ప్రధాన ఆరోపణ.

### యూకే కలకు లక్షలు.. CoS పత్రంతో కొత్త ట్విస్ట్

ఈ వ్యవహారంలో సోషల్ మీడియా పరిచయాలు కీలకంగా మారినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. 'నందూస్ వరల్డ్' ద్వారా రామ నందనకు వచ్చిన గుర్తింపు, కుటుంబానికి లండన్‌తో ఉన్న పరిచయాలపై ప్రచారం బాధితుల్లో నమ్మకాన్ని పెంచినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్‌టీఆర్ జిల్లా పశ్చిమ ఇబ్రహీంపట్నానికి చెందిన మమ్మిళ్లపల్లి శివక్రాంతి కుమార్ ఫిర్యాదుతో ఈ కేసు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. లండన్‌లో మధుకర్‌తో పరిచయం ఉన్న శివక్రాంతి కుమార్ తన వీసా గడువు ముగిసే సమయంలో వీసా పొడిగింపు కోసం అతడిని సంప్రదించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ సమయంలో ఆయన భార్యకు ఉద్యోగం, వీసా స్పాన్సర్‌షిప్, సర్టిఫికేట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ (CoS) ఇప్పిస్తామని హామీ ఇచ్చినట్లు ఆరోపించారు.



ఈ హామీలను నమ్మి 2023లో విడతలుగా సుమారు రూ.15 లక్షలు చెల్లించినట్లు ఫిర్యాదులో ఉంది. తరువాత ఇచ్చిన స్పాన్సర్‌షిప్ పత్రంపై ఉన్న బ్రిటన్ కంపెనీని సంప్రదించగా తాము అలాంటి పత్రాన్ని జారీ చేయలేదని చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆ పత్రం నకిలీదై ఉండొచ్చన్న అనుమానం ఏర్పడింది. ఉద్యోగం, వీసా రాకపోవడంతో డబ్బు తిరిగి ఇవ్వాలని బాధితుడు కోరగా.. తాను చెల్లించిన రూ.15 లక్షల్లో కేవలం రూ.2 లక్షలు మాత్రమే తిరిగి వచ్చాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. మిగిలిన మొత్తంపై ఇబ్రహీంపట్నం పోలీసులను ఆశ్రయించడంతో క్రైమ్ నంబర్ 515/2025 నమోదు చేశారు. మధుకర్, రామ నందన, మధుకర్ తండ్రి మోహన్‌రావును నిందితులుగా పేర్కొన్నారు. ఇప్పుడు బ్యాంకు లావాదేవీలు, ఫోన్ కాల్స్, వాట్సాప్ సంభాషణలు, పత్రాల మార్పిడి వంటి అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. CoS పత్రం ఎవరు తయారు చేశారు? ఎవరు అందించారు? డబ్బులు ఎవరికి చేరాయి? అన్న ప్రశ్నలకు సమాధానాలు కేసులో కీలకంగా మారనున్నాయి.

### 20 మంది బాధితులా?.. నందన ఖండనతో మరో కోణం

ఒక ఫిర్యాదుతో మొదలైన వ్యవహారం ఇప్పుడు మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పోలీసుల ప్రాథమిక అనుమానం ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన సుమారు 20 మంది వరకు ఇలాంటి హామీలను ఎదుర్కొని ఉండొచ్చని తెలుస్తోంది. ఉద్యోగాలు ఇప్పిస్తామని, యూకే వీసాలు పొడిగిస్తామని, స్పాన్సర్‌షిప్ పత్రాలు ఇప్పిస్తామని చెప్పి ఒక్కొక్కరి నుంచి లక్షల రూపాయలు తీసుకున్నట్లు మరిన్ని ఆరోపణలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. సోషల్ మీడియాలో కూడా కొందరు ఇలాంటి ఆరోపణలు చేయడం కేసుపై చర్చను పెంచింది. అయితే సోషల్ మీడియాలో వచ్చిన ప్రతి ఆరోపణను అధికారికంగా నిర్ధారిత వాస్తవంగా పరిగణించలేం. మరోవైపు రామ నందన మాత్రం తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. తనకు గానీ, తన భర్తకు గానీ ఎలాంటి కన్సల్టెన్సీ సంస్థ లేదని ఆమె వీడియో ద్వారా స్పష్టం చేసినట్లు సమాచారం. వ్యక్తిగత విభేదాలు ఉన్న కొందరు కావాలనే తమపై ప్రచారం చేస్తున్నారని, తమ పేర్లను ఇతరులు దుర్వినియోగం చేసి డబ్బులు వసూలు చేసి ఉండొచ్చని ఆమె ఆరోపించినట్లు తెలుస్తోంది. దీంతో ఒకవైపు పోలీసుల ఆరోపణలు.. మరోవైపు నందన ఖండనగా కేసు మారింది. ఆరోపణలు నమోదవడం నేరం రుజువైనట్లు కాదు. బ్యాంకు రికార్డులు, డిజిటల్ కమ్యూనికేషన్, పత్రాల నిజానిజాలు, బాధితుల వాంగ్మూలాలు, డబ్బు ప్రవాహం ఆధారంగానే తుది వాస్తవాలు వెలుగులోకి రావాలి. ఈ కేసు విదేశీ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలపై కూడా మరోసారి హెచ్చరికగా నిలుస్తోంది. సోషల్ మీడియా ఫాలోయింగ్ చూసి నమ్మడం కాదు.. ఉద్యోగ ఆఫర్, స్పాన్సర్ లైసెన్స్, CoS, వీసా ప్రక్రియను అధికారిక మార్గాల్లో నిర్ధారించుకోవాలి. లండన్ కల కోసం లక్షలు చెల్లించే ముందు పత్రాల నిజానిజాలు పరిశీలించకపోతే అదే కల.. ఆర్థిక కష్టాలకు కారణమయ్యే ప్రమాదం ఉంది. ఈ కేసులో రూ.15 కోట్ల ఆరోపణలు నిజమా? బాధితులు ఎంతమంది? పత్రాలు నకిలీవా? డబ్బు ఎక్కడికి వెళ్లింది? నందన పాత్ర ఎంత? అన్న ప్రశ్నలకు దర్యాప్తే తుది సమాధానం చెప్పాల్సి ఉంది.

# బొత్స కుటుంబంలో కోల్డ్‌వార్



- వైసీపీకి చిన్న శ్రీను గుడ్‌బై
- చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి..

స్థానిక ఎన్నికలకు ముందు ఉత్తరాంధ్రలో వైసీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. మాజీ మంత్రి, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆయన టీడీపీ కండువా కప్పుకున్నారు. వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి పంపిన రాజీనామా లేఖలో వ్యక్తిగత కారణాలతో పార్టీని వీడుతున్నట్లు చిన్న శ్రీను పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వంతో పాటు విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలకు రాజీనామా చేశారు. విజయనగరం జడ్పీ చైర్మన్‌గా ఉన్న చిన్న శ్రీను ఉత్తరాంధ్రలో వైసీపీ సంస్థాగత వ్యవహారాల్లో కీలకంగా పనిచేశారు. 2015లో క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 2019 ఎన్నికల్లో విజయనగరం జిల్లాలో వైసీపీ విజయానికి కీలకంగా పనిచేశారు. అనంతరం జడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2024లో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ డిప్యూటీ కోఆర్డినేటర్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.

### కోల్డ్‌వార్ ముదిరిందా.. ?

విజయనగరంలో చిన్న శ్రీను తనకంటూ ప్రత్యేక రాజకీయ బలాన్ని పెంచుకోవడంతో ఆయన ప్రాధాన్యం క్రమంగా పెరిగింది. బొత్స సత్యనారాయణ శాసన మండలికి వెళ్లిన తర్వాత జిల్లాలో పార్టీ వ్యవహారాల్లో చిన్న శ్రీను మరింత చురుకైన పాత్ర పోషించారు. భీమిలి వైసీపీ సమన్వయకర్తగా కూడా ఆయన పనిచేశారు. 2024 ఎన్నికలకు ముందు ఎస్.కోట, ఎచ్చెర్ల నుంచి పోటీ చేయాలనే ఆసక్తి చూపినట్లు ప్రచారం జరిగింది. విజయనగరం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలనే ఆశ కూడా ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగింది. ఇదే సమయంలో కొంతకాలంగా బొత్స సత్యనారాయణ-చిన్న శ్రీను మధ్య విభేదాలు ఉన్నాయన్న ప్రచారం ఊపందుకుంది. పార్టీలో మేనల్లుడి ప్రాధాన్యాన్ని తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపించాయి. ఈ నేపథ్యంలో చిన్న శ్రీను వైసీపీని వీడి టీడీపీలో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. జిల్లాలో బలమైన సంస్థాగత నెట్‌వర్క్ కలిగిన నేతగా ఉన్న ఆయన పార్టీ మారడం విజయనగరంతో పాటు ఉత్తరాంధ్ర వైసీపీ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. స్థానిక ఎన్నికల ముందు జరిగిన ఈ పరిణామం వైసీపీ శ్రేణుల్లో కలకలం రేపుతోంది.




# లేదు.. కాదంటూనే.. బాంబు పేల్చిన బొత్స కుటుంబం

## చిన్న శ్రీను రాజీనామాతో ఉత్తరాంధ్రలో పెద్ద కలకలం

ఉత్తరాంధ్ర వైసీపీలో ఇప్పుడు చిన్న శ్రీను రాజీనామా హాట్ టాపిక్‌గా మారింది. బొత్స సత్యనారాయణ కుటుంబం వైసీపీని వీడుతుందంటూ కొంతకాలంగా ప్రచారం సాగుతున్నా.. ఆ కుటుంబం మాత్రం దానిపై పెద్దగా స్పందించలేదు. చివరకు బొత్స మేనల్లుడు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను పార్టీకి రాజీనామా చేయడం రాజకీయంగా కొత్త చర్చకు తెరతీసింది. వైసీపీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు జిల్లా అధ్యక్ష పదవికి, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతకు కూడా ఆయన రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతోనే పార్టీని వీడుతున్నట్లు చిన్న శ్రీను వెల్లడించినా.. రాజకీయంగా ఆయన స్థానాన్ని చూస్తే ఈ పరిణామాన్ని సాధారణ రాజీనామాగా కొట్టిపారేయడం కష్టం. ముఖ్యంగా 2024 ఎన్నికల తర్వాత వైసీపీ ఉత్తరాంధ్రలో ఎదుర్కొంటున్న బలహీనతల మధ్య ఈ పరిణామం చోటుచేసుకోవడం పార్టీ వర్గాల్లో చర్చకు కారణమైంది. జిల్లా అధ్యక్షుడిగా పార్టీ వ్యవహారాలను నడిపిన నేత ఒక్కసారిగా తప్పుకోవడం కేడర్‌లో కూడా ప్రశ్నలు రేకెత్తించే అంశంగా మారింది. బొత్స కుటుంబంపై నడుస్తున్న పార్టీ మార్పు ప్రచారానికి చిన్న శ్రీను రాజీనామా మరింత ఊతమిచ్చింది.

### చిన్న శ్రీను వెళ్లడం వెనుక రాజకీయ లెక్క

చిన్న శ్రీను రాజకీయ ప్రాధాన్యం ఒక్క పదవితో పరిమితం కాదు. బొత్స సత్యనారాయణకు అత్యంత సన్నిహితంగా ఉంటూ ఉత్తరాంధ్ర రాజకీయాల్లో కుటుంబానికి అండగా నిలిచిన నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. వైసీపీలో జిల్లా అధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. కీలకమైన భీమిలి నియోజకవర్గానికి ఇన్‌ఛార్జ్‌గా కూడా కొనసాగారు. దీంతో చిన్న శ్రీను రాజీనామా అంటే కేవలం ఒక జిల్లా అధ్యక్షుడి వైదొలగడం కాదు.. బొత్స కుటుంబ రాజకీయ వ్యవస్థలో కీలక వ్యక్తి తప్పుకోవడం అనే చర్చ మొదలైంది. వైసీపీ ఇప్పటికే పలువురు నేతలను కోల్పోతున్న సమయంలో ఈ పరిణామం పార్టీకి మరింత ఇబ్బందికరంగా మారింది. ఉత్తరాంధ్రలో పార్టీకి ఉన్న పాత బలం, స్థానిక నాయకత్వం, క్యాడర్‌పై ప్రభావం ఎలా ఉంటుందన్న ప్రశ్నలు ఇప్పుడు ముందుకొస్తున్నాయి. 2024 ఎన్నికల ఓటమి తర్వాత వైసీపీకి ప్రధాన సవాలు క్యాడర్‌ను నిలబెట్టుకోవడమే. నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలను కొనసాగించడం, ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని చురుగ్గా ఉంచడం, స్థానికంగా నేతల మధ్య సమన్వయం కొనసాగించడం కీలకంగా మారాయి. అలాంటి సమయంలో జిల్లా అధ్యక్షుడి స్థాయిలో ఉన్న నేత బయటకు వెళ్లడం పార్టీకి రాజకీయంగా ఇబ్బందికర సంకేతంగా కనిపిస్తోంది. ఒకవైపు పార్టీ పునర్నిర్మాణం అవసరమైన సమయంలో.. మరోవైపు కీలక కుటుంబానికి చెందిన నేత రాజీనామా చేయడం వైసీపీకి డబుల్ ఛాలెంజ్‌గా మారింది.

### బొత్సపై ప్రచారానికి కొత్త ఊపిరి

బొత్స సత్యనారాయణ పార్టీ మారతారంటూ కొంతకాలంగా రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా జనసేనలోకి వెళ్తారనే ఊహాగానాలు కూడా వినిపించాయి. అయితే బొత్స మాత్రం ఆ ప్రచారంపై స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించలేదు. పార్టీ మార్పును పూర్తిగా ఖండించలేదు.. వైసీపీని వీడుతున్నట్లు ప్రకటించలేదు. ఇదే సమయంలో మేనల్లుడు చిన్న శ్రీను పార్టీకి రాజీనామా చేయడం ఆ ఊహాగానాలకు కొత్త కోణాన్ని ఇచ్చింది. చిన్న శ్రీను ముందుగా బయటకు రావడం బొత్స రాజకీయ భవిష్యత్‌పై చర్చను మరింత పెంచింది. అయితే చిన్న శ్రీను రాజీనామా చేశారనే కారణంతో బొత్స కూడా పార్టీ మారతారని నిర్ధారించలేం. అదే సమయంలో ఈ పరిణామం బొత్స కుటుంబంలో అంతా యథావిధిగా ఉందని చెప్పడానికి కూడా సరిపోదు. అసలు కారణాలు ఏమిటన్నది చిన్న శ్రీను వ్యక్తిగత ప్రకటనతోనే పరిమితమై ఉంది. రాజకీయంగా మాత్రం ఆయన తదుపరి అడుగు కీలకం కానుంది. ఏ పార్టీలో చేరతారు? రాజకీయంగా ఎలాంటి బాధ్యత తీసుకుంటారు? లేక కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉంటారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు ఆసక్తి రేపుతున్నాయి. రాజీనామా తర్వాత చిన్న శ్రీను వేసే అడుగే ప్రస్తుత పరిణామానికి అసలు అర్థాన్ని నిర్ణయించే అవకాశం ఉంది.

### వైసీపీకి ఇది చిన్న దెబ్బ కాదు

వైసీపీకి అసలు సమస్య చిన్న శ్రీను రాజీనామాతోనే ముగియదు. దాని ప్రభావం ఉత్తరాంధ్రలో పార్టీపై ఎలా పడుతుందన్నదే ఇప్పుడు కీలకం. 2024 తర్వాత పార్టీ బలహీనపడిన నేపథ్యంలో కీలక నేతలు దూరమైతే కార్యకర్తల్లో భవిష్యత్‌పై అనుమానాలు పెరిగే అవకాశం ఉంది. 'పార్టీలో మనకు భవిష్యత్ ఉందా?' అనే ప్రశ్న కేడర్‌లో మొదలైతే దాని ప్రభావం ఎన్నికల సమయానికి మరింత స్పష్టంగా కనిపించొచ్చు. మరోవైపు బొత్స సత్యనారాయణ వైసీపీలోనే కొనసాగుతారా? కొనసాగితే ప్రస్తుత పరిణామంపై ఆయన వైఖరి ఎలా ఉంటుంది? కుటుంబ రాజకీయ సమీకరణాలను ఎలా ముందుకు తీసుకెళ్తారు? అన్నది కూడా ఆసక్తికరంగా మారింది. చిన్న శ్రీను రాజీనామా వ్యక్తిగత నిర్ణయమే అయితే ఈ పరిణామం కొంతకాలానికి సద్దుమణిగే అవకాశం ఉంది. కానీ ఇది బొత్స కుటుంబ భవిష్యత్ రాజకీయ వ్యూహంలో తొలి అడుగైతే మాత్రం ఉత్తరాంధ్రలో సమీకరణాలు మారొచ్చు. ఇప్పటివరకు 'లేదు.. కాదంటూ' సాగిన ప్రచారానికి చిన్న శ్రీను రాజీనామా ఒక కొత్త మలుపు ఇచ్చింది. ఇప్పుడు అందరి చూపు బొత్స సత్యనారాయణ తదుపరి అడుగుపైనే ఉంది. రాజకీయాల్లో కొన్ని సంకేతాలు మాటలతో రావు.. పరిణామాల రూపంలో బయటపడతాయి. చిన్న శ్రీను రాజీనామా అలాంటి తొలి సంకేతమా? లేక వ్యక్తిగత నిర్ణయంతో ముగిసే అధ్యాయమా? రాబోయే రాజకీయ పరిణామాలే తేల్చనున్నాయి.



# బీసీసీఐ భాగస్వాముల్లో ChatGPT హవా

## మూడు సంస్థలతో భారీ ఒప్పందం

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక వాణిజ్య నిర్ణయం తీసుకుంది. భారత్ స్వదేశీ క్రికెట్ సీజన్‌కు క్యాంపా, ఎస్‌బీఐ లైఫ్, ChatGPTను అసోసియేట్ పార్ట్‌నర్లుగా ఎంపిక చేసింది. ఈ భాగస్వామ్యం రెండు సీజన్ల పాటు కొనసాగనుంది. భారత్‌వెస్టిండీస్ మధ్య జరగనున్న తదుపరి స్వదేశీ సిరీస్‌తో ప్రారంభమై 2028 మార్చి వరకు కొనసాగుతుంది. ఈ మూడు భాగస్వామ్యాల మొత్తం ఒప్పంద విలువ రూ.130 కోట్లకు పైగా ఉంటుందని బీసీసీఐ వెల్లడించింది. గత చక్రంతో పోలిస్తే ఈసారి ఒప్పంద విలువ 44 శాతం పెరిగింది. పానీయాలు, బీమా, కృత్రిమ మేధ రంగాలకు చెందిన మూడు ప్రముఖ బ్రాండ్లు భారత క్రికెట్‌తో చేతులు కలపడం ద్వారా బీసీసీఐ వాణిజ్య పరిధి మరింత విస్తరించనుంది. క్రికెట్‌కు ఉన్న భారీ అభిమాన వర్గాన్ని చేరుకోవడానికి, వినియోగదారులతో అనుసంధానం పెంచుకోవడానికి ఈ భాగస్వామ్యాలు కొత్త అవకాశాలను అందిస్తాయని బీసీసీఐ పేర్కొంది. బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ మాట్లాడుతూ.. భారత్ స్వదేశీ సీజన్ దేశంలో అత్యంత విలువైన క్రీడా వేదికగా కొనసాగుతోందని అన్నారు. క్యాంపా, ఎస్‌బీఐ లైఫ్, ChatGPT భాగస్వామ్యం భారత క్రికెట్ వ్యవస్థపై ప్రముఖ సంస్థలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఒప్పందాల విలువ 44 శాతం పెరగడం ప్రత్యేకంగా ప్రోత్సాహకరమని తెలిపారు. బీసీసీఐ గౌరవ కార్యదర్శి దేవజిత్ సైకియా కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. స్వదేశీ క్రికెట్ భాగస్వామ్యాల విలువ పెరగడం ద్వారా బీసీసీఐ, టీమిండియా మార్కెట్‌పై బ్రాండ్లకు ఉన్న విశ్వాసం స్పష్టమవుతోందన్నారు. క్యాంపా, ఎస్‌బీఐ లైఫ్, ChatGPT మూడు విభిన్న రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, భారత క్రికెట్ ద్వారా వ్యాపార సంస్థలకు ఉన్న విస్తృత అవకాశాలను ఈ భాగస్వామ్యం చూపిస్తోందని చెప్పారు. అభిమానులతో కొత్త రీతుల్లో అనుసంధానం పెంచేందుకు, భారత క్రికెట్ అనుభవాన్ని మరింత విస్తరించేందుకు ఈ సంస్థలతో కలిసి పనిచేస్తామని బీసీసీఐ తెలిపింది.

# పాకిస్థాన్‌కు ఐసీసీ షాక్

## ఫిరోజాపై జరిమానా.. డీమెరిట్ పాయింట్



మహిళల ఆసియా కప్‌లో పాకిస్థాన్‌కు వరుసగా క్రమశిక్షణా షాక్‌లు తగులుతున్నాయి. కెప్టెన్ ఫాతిమా సనా తర్వాత ఇప్పుడు పాకిస్థాన్ బ్యాటర్ గుల్ ఫిరోజాపై ఐసీసీ చర్యలు తీసుకుంది. హాంకాంగ్‌తో సోమవారం దుబాయ్‌లో జరిగిన గ్రూప్‌ఏ మ్యాచ్‌లో ఐసీసీ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆమెకు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా, ఒక డీమెరిట్ పాయింట్ విధించారు. ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.8 కింద ఆమె తప్పిదం నమోదైంది. అంతర్జాతీయ మ్యాచ్‌లో అంపైర్ నిర్ణయంపై అసమ్మతి వ్యక్తం చేయడం ఈ నిబంధన పరిధిలోకి వస్తుంది. పాకిస్థాన్ ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో ఎల్‌బీడబ్ల్యూగా ఔటైన ఫిరోజా.. నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బంతిని బ్యాట్‌కు తాకించానని సూచించేలా బ్యాట్ వైపు చేతితో సంకేతం చేశారు. దీంతో అంపైర్ నిర్ణయాన్ని వ్యతిరేకించినట్లుగా ఐసీసీ పరిగణించింది. గత 24 నెలల్లో ఫిరోజాకు ఇది రెండో క్రమశిక్షణా తప్పిదం కావడంతో ఆమె ఖాతాలో డీమెరిట్ పాయింట్లు రెండుకు చేరాయి. ఈ కేసులో ఫిరోజా తన తప్పిదాన్ని అంగీకరించారు. ఐసీసీ అంతర్జాతీయ మ్యాచ్ రిఫరీల ప్యానెల్‌కు చెందిన సుప్రియా రాణి దాస్ ప్రతిపాదించిన శిక్షను ఆమె అంగీకరించడంతో ప్రత్యేక విచారణ అవసరం లేకుండానే కేసు ముగిసింది. ఈ అభియోగాన్ని ఫీల్డ్ అంపైర్లు రబాబ్ అహ్సన్, రోకేయా సుల్తానా, థర్డ్ అంపైర్ శివానీ మిశ్రా, ఫోర్త్ అంపైర్ షతీరా జకీర్ నమోదు చేశారు. లెవల్ 1 నిబంధనల ఉల్లంఘనకు అధికారిక మందలింపు నుంచి మ్యాచ్ ఫీజులో 50 శాతం వరకు జరిమానా, ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్ల వరకు శిక్ష విధించే అవకాశం ఉంది. ఐసీసీ క్రమశిక్షణా విధానం ప్రకారం 24 నెలల్లో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ డీమెరిట్ పాయింట్లు వస్తే అవి సస్పెన్షన్ పాయింట్లుగా మారతాయి.



# మూడేళ్లుగా మాటల్లేవు

### ఇమ్రాన్‌పై వసీం అక్రమ్ ఆవేదన

పాకిస్థాన్ క్రికెట్ దిగ్గజం వసీం అక్రమ్ తన మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా ఇమ్రాన్‌తో తాను మాట్లాడలేదని వెల్లడించిన అక్రమ్.. రాజకీయంగా ఆయన ఎదుర్కొంటున్న పరిస్థితి ఎంతో బాధాకరమని అన్నారు. అయితే కోర్టు తీర్పులు, న్యాయపరమైన అంశాలపై తాను వ్యాఖ్యానించబోనని, ఇమ్రాన్ ఆరోగ్యం విషయంలో మాత్రం ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. 1992 ప్రపంచకప్ విజేతగా పాకిస్థాన్‌కు తొలి వన్డే ప్రపంచకప్ అందించిన ఇమ్రాన్ 2022 నుంచి జైలులో ఉన్నారు. పలు అవినీతి కేసుల్లో దోషిగా తేలినప్పటికీ తాను ఎలాంటి తప్పు చేయలేదని ఇమ్రాన్ ఖాన్ చెబుతున్నారు. 73 ఏళ్ల ఇమ్రాన్‌కు సరైన వైద్యం, మానవీయ పరిస్థితులు కల్పించాలని ఇటీవల 22 మంది మాజీ అంతర్జాతీయ కెప్టెన్లు పాకిస్థాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్‌కు బహిరంగ లేఖ రాశారు. వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారా కూడా ఇమ్రాన్ ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేశారు.

### ఆరోగ్యం కాపాడాలి

ఇమ్రాన్ పరిస్థితులపై ఇంగ్లండ్‌తో పాటు ఇతర దేశాల్లో కూడా స్పందనలు వస్తున్నాయని వసీం అక్రమ్ తెలిపారు. అయితే పాకిస్థాన్‌లో అలాంటి పరిస్థితి కనిపిస్తుందో లేదో తనకు స్పష్టంగా తెలియదని వ్యాఖ్యానించారు. స్నేహితుడిగా, వ్యక్తిగతంగా ఇమ్రాన్ గురించి తాను ఆందోళన చెందుతున్నానని చెప్పారు. ఆయన దోషిగా తేలినా, జైలులో ఉన్నా ఆరోగ్యాన్ని కాపాడాల్సిందేనని పేర్కొన్నారు. ప్రభుత్వ వర్గాలు ఇమ్రాన్ ఆరోగ్యం బాగానే ఉందని చెబుతున్నప్పటికీ తనకు ఆందోళనగా ఉందని అక్రమ్ అన్నారు. "అతన్ని చాలా మిస్ అవుతున్నాను" అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఇమ్రాన్ మాజీ సహచరుడు జావెద్ మియాందాద్ కూడా ఆయన ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు. ఇమ్రాన్ ఖాన్‌కు సరైన వైద్య చికిత్స అందించాలన్న డిమాండ్ మాజీ క్రికెటర్ల నుంచి పెరుగుతున్న వేళ, వసీం అక్రమ్ వ్యాఖ్యలు పాకిస్థాన్‌లో మరింత చర్చకు దారితీశాయి.



# 'కాకా'కుమార్తె గా అమ్ములు పాప...!

మెగాస్టార్ చిరంజీవి 'కాకా'లో ఆయన కుమార్తెగా మలయాళ భామ అనస్వర రాజన్ నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇవాళ ఆమె బర్త్ డే స్పెషల్‌గా ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు.

మలయాళీ భామ అనస్వర రాజన్ బ్యాక్ టు బ్యాక్ తెలుగు సినిమాలు చేస్తున్నారు. శ్రీకాంత్ తనయుడు రోషన్ సరసన 'ఛాంపియన్'లో ఆమె కథానాయికగా నటించారు. ప్రస్తుతం సంగీత్ శోభన్ హీరోగా రూపొందుతున్న 'అంతా రాములోరు చూసుకుంటారు'లోనూ హీరోయిన్ ఆవిడే. ఆ రెండూ కాకుండా మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వం వహిస్తున్న సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అనస్వర రాజన్ పుట్టినరోజు సందర్భంగా సినిమాలో ఆమె ఫస్ట్ లుక్ విడుదల చేశారు. అనస్వర రాజన్ పుట్టినరోజు సందర్భంగా చిరంజీవి 'కాకా' నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేశారు. తమ సినిమాలో అమ్ములు పాప పాత్ర పోషిస్తున్నట్టు తెలిపారు. 'హార్ట్ ఆఫ్ కాకా'గా అనస్వర పాత్రను పేర్కొన్నారు. ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు.

కెరీర్ ప్రారంభంలో మెగాస్టార్ చిరంజీవితో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం తనకు రావడం పట్ల అనస్వర రాజన్ సంతోషం వ్యక్తం చేశారు. 'అంతా రాములోరు చూసుకుంటారు' టీజర్ విడుదల కార్యక్రమంలో 'కాకా' గురించి అనస్వర రాజన్ మాట్లాడుతూ... "చిరంజీవి గారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా గర్వంగా, సంతోషంగా ఉంది. సెట్స్‌లో ఆయన్ను చూసి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. సినిమా బాగా వస్తోంది. థియేటర్లలో ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తారు. మరీ ముఖ్యంగా మెగా అభిమానులకు అమితంగా నచ్చుతుంది'' అని చెప్పారు.

సంక్రాంతికి... జనవరి 13న విడుదల చిరంజీవి హీరోగా బాబీ కొల్లి దర్శకత్వం వహిస్తున్న 'కాకా'ను కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ రూపొందిస్తోంది. మలయాళ హిట్ 'బాలన్: ది బాయ్', విజయ్ 'జన నాయకుడు', యష్ 'టాక్సిక్' తర్వాత వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్న చిత్రమిది. సంక్రాంతి సందర్భంగా వచ్చే ఏడాది (2027) జనవరి 13న సినిమాను థియేటర్లలోకి తీసుకు వస్తున్నారు.

చిరంజీవి, అనస్వర రాజన్ కాకుండా 'కాకా' సినిమాలో నివేదా పేతురాజ్, సునీల్, 'గెటప్' శ్రీను, కన్నడ హీరోయిన్ రచితా రామ్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల చిరంజీవి పుట్టినరోజున విడుదలైన గ్లింప్స్‌లో ఆయన్ను ఆక్వా ఇండస్ట్రీస్ సూపర్ వైజర్ సత్యం పాత్రలో చూపించారు.

# యష్ కీలక నిర్ణయం

## రెమ్యునరేషన్‌కు బదులు రైట్స్



కన్నడ రాకింగ్ స్టార్ యష్ క్రేజ్ ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'కేజీఎఫ్'సిరీస్ సక్సెస్ తరువాత ఆయనకు పాన్ ఇండియా వైడ్ గా భారీ క్రేజ్ వచ్చింది. అయితే ఇటీవల యష్ నటించిన 'టాక్సిక్'భారీ అంచనాలతో విడుదలైంది. కానీ, ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. తొలి రోజుల్లో మంచి ఓపెనింగ్స్ వచ్చినా.. ఆ తర్వాత కలెక్షన్లు దారుణంగా తగ్గిపోయాయి. దీంతో ఆ నష్టాన్ని భర్తీ చేసుకుకోవడానికి రాకీ భాయ్ ప్రయత్నిస్తున్నారంట. ఇంతకీ యష్ ప్లానింగ్ ఎంటీ? అసలేం చేయబోతున్నారు?

ఈ తరుణంలో అందరి దృష్టి 'రామాయణ'పై తన పడిందట. బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక సినిమా ఇది. దీనిని రెండు భాగాలుగా రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా కనిపించనున్నారు. సాయి పల్లవి సీత పాత్రలో నటిస్తున్నారు. యష్ రావణుడి పాత్రలో కనిపించనున్నారు. సన్నీ డియోల్ హనుమంతుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా, అరుణ్ గోవిల్ దశరథుడి పాత్రలో నటిస్తున్నారు. 'రామాయణ: పార్ట్ 1'నవంబర్ 6న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారట. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై బాలీవుడ్‌తో పాటు సౌత్‌లోనూ ఆసక్తి ఉంది. సినిమా విడుదలకు ముందే బిజినెస్ పరంగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. రావణుడిగా యష్.. 'రామాయణ'లో యష్ పోషిస్తున్న రావణుడి పాత్రపై మొదటి నుంచే ఆసక్తి ఉంది. ఆయన లుక్, పాత్ర స్వరూపం ఎలా ఉంటుందనే చర్చ జరుగుతోంది. 'కేజీఎఫ్'తో మాస్ ఇమేజ్ సొంతం చేసుకున్న యష్.. ఇప్పుడు పౌరాణిక పాత్రలో ఎలా కనిపిస్తారనేది ఆసక్తికరంగా మారింది. అయితే.. ఈ సినిమాలో నటుడిగానే కాకుండా యష్ కీలకమైన భాగస్వామి కూడా. యష్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ ఈ సినిమాకు కో ప్రొడక్షన్‌లో భాగంగా ఉన్నట్లు సమాచారం. ప్రైమ్ ఫోకస్ స్టూడియో అధినేత నమిత్ మల్హోత్రాతో కలిసి ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. రెమ్యునరేషన్‌కు బదులు రైట్స్? ఇప్పుడు 'రామాయణ'కు సంబంధించి యష్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నారట. సాధారణంగా పాన్ ఇండియా స్టార్ సినిమాకు భారీ పారితోషికం తీసుకుంటారు. యష్ కూడా రావణుడి పాత్రకు దాదాపు రూ.100 కోట్ల పారితోషికం తీసుకుంటారని గతంలో వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు పరిస్థితి మారినట్లు సమాచారం. యష్ పారితోషికం తీసుకోకుండా.. దానికి బదులుగా 'రామాయణ' సినిమా దక్షిణాది థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ హక్కులు తీసుకోవాలని భావిస్తున్నారట. అంటే తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో సినిమాను రిలీజ్ చేసే హక్కులను యష్ తీసుకోవాలని భావిస్తున్నారట.





# మాళవిక ప్రశంసలు!

### త్రిషలాంటి హీరోయిన్ ఇండస్ట్రీలో చాలా అరుదు..

సినీ ఇండస్ట్రీలో హీరోయిన్ల మధ్య పోటీ ఎక్కువగా ఉంటుందనే అభిప్రాయం తరచూ వినిపిస్తూ ఉంటుంది. అయితే, ఆ పోటీకి భిన్నంగా కో యాక్టర్ల సక్సెస్‌ను మనస్ఫూర్తిగా అభినందించే వ్యక్తిత్వాలు కూడా ఉంటాయని నటి మాళవికా మోహనన్ తాజా కామెంట్స్ మరోసారి గుర్తు చేశాయి. ముఖ్యంగా స్టార్ హీరోయిన్ త్రిషతన కెరీర్‌లో చూపించిన ఆప్యాయత, కొత్త నటీనటుల పట్ల ఆమె వ్యవహరించే తీరు తనకు ఎంతో ప్రత్యేకంగా అనిపించిందని మాళవిక వెల్లడించారు.

తన సినీ కెరీర్ స్టార్టింగ్ స్టేజ్ లో ఉన్నప్పుడు రజనీకాంత్ నటించిన పేట మూవీలో అవకాశం రావడం తనకు పెద్ద బ్రేక్ అయినప్పటికీ, కమర్షియల్ సినిమాల ఎక్స్‌పీరియెన్స్ లేక కొంత ప్రెజర్ కు గురైనట్లు ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ టైమ్‌లో వారణాసిలో జరిగిన షూటింగ్‌లో త్రిషతో కలిసి నటించే అవకాశం రావడంతో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడిందన్నారు. సాధారణంగా తమ వర్క్ తోనే పరిమితమయ్యే వారితో పోలిస్తే, త్రిష మాత్రం కొత్తవారిని కూడా ఆప్యాయంగా పలకరించి, వారికి ధైర్యం చెప్పే వ్యక్తి అని మాళవిక ప్రశంసించారు. ఆ తర్వాత విజయ్ సరసన మాస్టర్ మూవీలో ఛాన్స్ దక్కినప్పుడు త్రిష స్వయంగా మెసేజ్ చేసి అభినందించడం తనను ఎంతో ఆనందానికి గురి చేసిందని మాళవిక తెలిపారు. ఎదుగుతున్న కో యాక్ట్రెస్ ను ఎంకరేజ్ చేయడానికి నిజంగా చాలా పెద్ద మనసు అవసరమని, ఆ క్వాలిటీ త్రిషలో పుష్కలంగా ఉందని అన్నారు. ప్రస్తుతం కార్తీ తో కలిసి నటించిన సర్దార్ 2 రిలీజ్ కు రెడీ అవుతున్న వేళ, మాళవిక చేసిన ఈ కామెంట్స్ ఇండస్ట్రీలో త్రిష వ్యక్తిత్వంపై మరోసారి చర్చకు దారితీశాయి.

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.